




	ఇఫ్తార్	సెహరీ
	శనివారం	ఆదివారం
కర్నూలు	6:32	5:09
నంద్యాల	6:29	5:09



శభాష్ కైరున్..!

కైరున్ బీ... కష్టపడటంలో మగవాళ్లకు ఏమాత్రం తీసిపోకుండా కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఎన్ని ఇబ్బందులు వచ్చినా అధైర్యపడకుండా పంక్చర్ షాపు నిర్వహిస్తూ ఎంతో మంది మహిళలకు ఆదర్శంగా నిలిచారు. దేవనకొండ మండలం కప్పట్రాళ్లకు చెందిన రంజాన్ బాషా, బక్షుబీ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు. వీరిలో పెద్ద కుమార్తె కైరున్ బీ. వివాహమైన నెల రోజుల్లోనే అనివార్య కారణాలతో భర్తకు దూరమై తల్లిదండ్రులతోనే ఉంటున్నారు. గత 15 సంవత్సరాలుగా సోదరుడితో కలిసి పంక్చర్ షాపును నిర్వహిస్తున్నారు. ద్విచక్ర వాహనాలే కాకుండా లారీలు, ట్రాక్టర్లు, ప్రొక్లెయినర్లు వంటి భారీ వాహనాల టైర్లకు పంక్చర్లు వేస్తూ సమాజంలో మహిళల సత్తా ఏమిటో నిరూపిస్తున్నారు. కర్నూలు-బళ్లారి రహదారిపై కప్పట్రాళ్ల బస్‌స్టేజీ వద్ద చిన్న గుడిసెలో పంక్చర్‌షాపు నిర్వహిస్తున్నారు. దుకాణంలో రెండు సార్లు చోరీ జరిగింది. దాదాపు రూ.2 లక్షల విలువైన సామగ్రిని దొంగలు దోచుకెళ్లారు. అయినప్పటికీ వెనకడుగు వేయకుండా స్వయం కృషితో ముందుకు సాగుతున్నారు. కష్టాన్నే నమ్ముకున్న కైరున్‌బీకి ప్రభుత్వం ఆర్థికంగా రుణ సౌకర్యం కల్పించి ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మహిళా దినోత్సవం రోజున కైరున్‌బీ అభినందించాల్సిందే. - దేవనకొండ, (ఆంధ్రజ్యోతి)

షీ బాక్స్ ఏర్పాటు

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లో షీబాక్స్‌ను కలెక్టర్ రంజిత్ బాషా ప్రారంభించారు. ఏపీ జేఏసీ అమరావతి కర్నూలు జిల్లా మహిళా విభాగం ఆధ్వర్యంలో షీబాక్స్‌ను ఏర్పాటు చేశారు. సమస్యలను బహిరంగంగా చెప్పుకోలేని మహిళా ఉద్యోగులు ఈ షీబాక్స్‌లో వినతులు పోస్ట్ చేయవచ్చని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జేసీ నవ్య, డీఆర్వో వెంకట నారాయణమ్మ, ఏపీ జేఏసీ అమరావతి జిల్లా అధ్యక్షుడు కేవై.కృష్ణ మహిళా విభాగం ఛైర్‌పర్సన్ సాహేరా బాను తదితరులు పాల్గొన్నారు.

- కర్నూలు కలెక్టరేట్ (ఆంధ్రజ్యోతి)



షీబాక్స్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా


అంధకారంలో గాజులదిన్నె ప్రాజెక్టు

చీకట్లో గాజులదిన్నె

గోనెగండ్ల, మార్చి 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఏకైక మధ్యతరహా నీటి పారుదల ప్రాజెక్టు సంజీవయ్యసాగర్ (గాజులదిన్నె ప్రాజెక్టు) క్రస్ట్ గేట్లకు, ప్రాజెక్టు పరిసరాలలో గత కొన్నేళ్లుగా విద్యుత్ సరఫరా లేక అంధకారంలో మగ్గిపోతోంది. ప్రాజెక్టు ప్రాంతం సాయంత్రం ఆరు గంటలు దాటితే అంతా చిమ్మ చీకటిగా ఉంటుంది. ప్రస్తుతం ప్రాజెక్టు క్రస్ట్‌గేట్ల పనులు నత్తనడకన సాగుతున్నాయి. గత నాలుగు నెలల క్రితం స్థానిక ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి ప్రాజెక్టు పరిశీలించి క్రస్ట్ గేట్ల పనులు 20 రోజులలో పూర్తి చేయాలని, లేకుంటే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని కాంట్రాక్టర్‌ను హెచ్చరించారు. ఆరు నెలలు పూర్తి కావస్తున్నా క్రస్ట్ గేట్ల పనులు పూర్తి కాలేదు. రాత్రి పూట క్రస్ట్ గేట్లు దూర ప్రాంతంలోని వారికి కనిపించేలా రంగుల విద్యుత్ బల్బులు ఏర్పాటు చేయాలి. అయితే కాంట్రాక్టర్ ఇప్పటి దాకా చేసిన పనులకు దాదాపు రూ. 27 కోట్లు పెండింగ్ ఉన్నందున గేట్లకు విద్యుత్ బల్బులు ఏర్పాటు చేయలేదు. దీంతో ప్రాజెక్టు పరిసర ప్రాంతం అంతా చీకట్లు అలుముకున్నాయి. రాత్రి పూట చీకటిగా ఉండటంతో కొందరు ఆకతాయిలు మద్యం సేవించి, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. అదే గాక అక్కడ ప్రాజెక్టుకు సంబంధించిన ఇనుప వస్తువులు, రాడ్ల చోరీ జరిగిన సందర్భాలు ఉన్నాయి.

2020 నుంచి అందని విద్యుత్ బిల్లు

ప్రాజెక్టు విద్యుత్ బిల్లు కట్టడానికి గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల నిధులు విడుదల చేయలేదు. ఈ కారణంగా ప్రాజెక్టు పరిసరాలలో లైట్లు వెలగడం లేదు. దీంతో క్రస్ట్ గేట్ల దగ్గర సిబ్బంది విద్యుత్ దీపాలు వెలిగించడం మానుకున్నారు. 2020 నుంచి ఇప్పటి వరకు విద్యుత్ బిల్లుకు నిధులు విడుదల కాలేదు. దాదాపు ఐదేళ్ల నుంచి రూ. 52 లక్షలు బిల్లు పెండింగ్‌లో ఉంది. టీడీపీ ప్రభుత్వం కరెంటు బిల్లులు మంజూరు చేస్తుందని ఆశతో సిబ్బంది ఉన్నారు. పీఏవో కార్యాలయంలో నిధుల కొరత కారణంగా బిల్లులు పాస్ కాలేదని తెలుస్తుంది. ప్రతి నెల ప్రాజెక్టుకు సాధారణ బిల్లు కింద రూ. 50వేలు పైగానే వస్తుంది. ఇక్కడ పనిచేసే

ప్రాజెక్టు కింద బ్రిడ్జిని దాటే ఐదు గ్రామాలకు దారి

ప్రాజెక్టు కట్ట కింద ఉన్న బ్రిడ్జిని దాటి పిల్లిగుండ్ల, నెరుడుప్పల, ఒంటెడుదిన్నె, ఎర్రబాడు, బండగట్టు తదితర గ్రామాలకు వెళ్లే దారి ఉంది. రాత్రి పూట ప్రాజెక్టు దగ్గర చీకట్లు అలుముకోవడంతో ఈ గ్రామాల ప్రజలకు ఇబ్బందిగా మారింది. కట్ట కింద ఉన్న బ్రిడ్జిని దాటే సమయంలో ద్విచక్రవాహనదారులు జాగ్రత్త తీసుకోకుంటే ప్రమాదవశాత్తు బ్రిడ్జి కింద ఉన్న నీళ్లలో పడిపోయే పరిస్థితి ఉంది.

- 2020 నుంచి విద్యుత్ బిల్లులు నిలిపేసిన గత ప్రభుత్వం
- రూ. 52 లక్షల బిల్లు పెండింగ్
- ఇబ్బందుల్లో సిబ్బంది

ఇక్కడ అన్నీ ఇబ్బందులే

ప్రతి ఏడాది వర్షాకాలంలో వరద ఎక్కువగా వచ్చినప్పుడు కిందికి నీరు వదిలేందుకు గాను గేట్లు ఎత్తాలి. ఇందుకు గాను గ్రీసు, డీజిల్, బల్బులు సమకూర్చాలి. ప్రతి రెండు మూడు రోజులకు ఒకసారి ఇంజన్లను అపరేట్ చేయాల్సి ఉంటుంది. లేక పోతే అవి పాడై పోయే ప్రమాదం ఉంది. అందుకు గాను ఇంజన్ అపరేటింగ్ కోసం డీజిల్ అవసరం అవుతుంది. అయితే 2022 నుంచి ప్రాజెక్టుకు విడుదల కావాల్సిన సాధారణ నిధులు(మెయిన్‌టెనెన్స్ ఫండ్) కూడా విడుదల కాలేదు జిల్లాలో ఏకైక మధ్య తరహా ప్రాజెక్టు అయినప్పటికీ ఏనాడూ ప్రభుత్వం దీని అభివృద్ధికి నిధులు కేటాయించ లేదు. రెండు నెలల క్రితం మెయిన్‌టెనెన్స్ నిధులను విడుదల చేయాలని అధికారులు ప్రభుత్వానికి నివేదిక తయారు చేసి పంపినట్లు తెలుస్తున్నది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నిధులు విడుదల చేయాలని ప్రాజెక్టు సిబ్బంది, ఆయకట్టు రైతులు కోరుతున్నారు.


సిబ్బంది తన సొంత ఖర్చులతో ఆరు గేట్ల దగ్గర అవసర సమయంలో ఆరు ఫ్లడ్ లైట్లను ఏర్పాటు చేసి అత్యవసర సమయంలో వాటిని ఉపయోగిస్తున్నారు.

నిధుల నివేదిక పంపాం

ప్రాజెక్టుకు 2022 నుంచి ఇప్పటి వరకు సాధారణ నిధులు విడుదల కాలేదు. దీంతో నిర్వహణ ఇబ్బందిగా మారింది. అయితే ఈ ఏడాది ప్రాజెక్టు సాధారణ నిధుల కోసం అంచనా తయారు చేసి ఉన్నతాధికారులకు పంపాం. 2020 నుంచి కరెంటు బిల్లులు విడుదల కాలేదు. దాదాపు రూ. 52లక్షల బిల్లు పెండింగ్‌లో ఉంది.

- విజయ్‌కుమార్ డీఈ, గాజులదిన్నె ప్రాజెక్టు

మహిళలకు రూ.163.94 కోట్ల పంపిణీకి సిద్ధం

కర్నూలు కలెక్టరేట్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లాలో మహిళ లకు రూ.163 కోట్ల మెగా చెక్కులను పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ పి.రంజి త్ బాషా పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎంఆర్‌సీ కన్వెన్షన్ హాలులో ఘనంగా నిర్వహించే మహిళా దినోత్సవం వేడుకల్లో డీఆర్‌డీఏ బ్యాంకు లింకేజీ ద్వారా 7040 మంది పొదుపు గ్రూపు సభ్యులకు రూ.57.92 కోట్లు, స్త్రీ నిధి ద్వారా 3836 మంది సభ్యులకు రూ.18.36 కోట్లు, స్త్రీనిధి-హెచ్‌డీ లోన్ల ద్వారా 400 మంది సభ్యులకు రూ.2.30 కోట్లతోపాటు, ఇంకా వివిధ పథకాల కింద చెక్కులు ఇవ్వనున్నట్లు తెలిపారు.

ఇంటర్ పరీక్షకు 414 మంది గైర్హాజర్

కర్నూలు ఎడ్యుకేషన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం పరీక్షకు శుక్రవారం 414 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జిల్లాలో ఇంటర్ రెండో సంవత్సరం విద్యార్థులు మొత్తం 21,302 మంది విద్యార్థులు నమోదు చేసుకున్నారు. 20,864 మంది పరీక్షకు హాజరు కాగా ఇందులో 414 మంది గైర్హాజరయ్యారు. మాస్ కాపీయింగ్‌కు పాల్పడి కర్నూలు బీ క్యాంపు ఒకేషనల్ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో ఇద్ద రు విద్యార్థులను డీబార్ అయినట్లు ఆర్ఐవో ఎస్‌వీఎస్ గురువయ్యశెట్టి తెలిపారు. అలాగే ఓపెన్ స్కూల్ ఇంటర్మీడియట్ పరీక్షలో జిల్లాలో ఇంటర్మీడియట్ విద్యార్థులు మొత్తం 1331 మంది దరఖాస్తులు చేసుకోగా.. 1180 మంది పరీక్షకు హాజరయ్యారు. 151 మంది గైర్హాజరయ్యారు. మాల్‌ప్రాక్టీసు కేసులు నమోదు కాలేదని డీఈవో శామ్యూల్ పాల్ తెలిపారు.

మహిళా దినోత్సవ కథనాలు 6లో..

నృసింహుని బ్రహ్మోత్సవం

- హంస, సూర్యప్రభ వాహనాలపై ప్రహ్లాద వరదస్వామి
- హనుమంత వాహనంపై అహోబిలేశుడు

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), మార్చి 7(ఆంధ్రజ్యోతి) : నల్లమలలోని అహోబిల నారసింహుడి క్షేత్రాలు భక్తుల గోవింద నామస్మరణతో ప్రతిధ్వనిస్తున్నాయి. దిగువ అహోబిలంలో మఠం 46వ పీఠాధిపతి శ్రీవణ్ శఠగోప రంగనాథ యతీంద్ర మహాదేశికన్ శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులకు అర్చనలు నిర్వహించారు. ప్రహ్లాద వరదస్వామి ఉభయ దేవేరులతో పల్లకిలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ప్రహ్లాద వరదస్వామి రాజహంస వాహనంపై, రాత్రి సూర్యప్రభ వాహనంపై ఆలయ మాడ వీధుల్లో విహరించారు.

హనుమంత వాహనంపై జ్వాలా నరసింహ స్వామి

ఎగువ అహోబిలంలో శ్రీదేవి, భూదేవి సమేత జ్వాలా నరసింహస్వామి ఉత్సవమూర్తులకు అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. స్వామి అమ్మవార్లకు యోగా నృసింహ గరుడ విమాన సేవ నిర్వహించి తిరువీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. విశేషంగా అలంకరించిన హనుమంత వాహనంపై జ్వాలా నరసింహస్వామిని కొలువుంచి మాడవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు కిడాంబి వేణుగోపాలన్, మణియార్ సౌమ్యనారాయణన్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.


అలంకరణలో శ్రీదేవి, భూదేవీ సమేత నరసింహస్వామి

సింహవాహనంపై రంగనాథస్వామి

గోదా గోకుల క్షేత్రంలో వాహన సేవలు

కర్నూలు కల్చరల్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): మామిదాలపాడులో వెలసిన గోదారంగనాథస్వామి దేవస్థానం(గోదా గోకుల క్షేత్రం)లో ఆల య ద్వితీయ బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి.ఆరో రోజు శుక్రవారం స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. ఉత్స వాల్లో భాగంగా రంగనాథస్వామి వారిని సింహ వాహనంపై ఆసీనిం పజేసి ఆలయ మాడవీధుల్లో ఊరేగించారు. అనంతరం ఉత్సవ మూర్తు లకు నవకలశ స్నపనం చేసి, ఆలయం ఆవరణలో చక్రస్నాన కార్యక్ర మాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భక్తులు వసంతోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. సాయంత్రం స్వామివారి ఉత్సవ మూర్తిని అశ్వ వాహనంపై ఊరేగించారు. ఈ వేడుకలను త్రిదండి అష్టాక్షరీ సంపత్కుమార రామానుజ జీయర్ స్వామి, అర్చకులు రమేష్ భట్టార్, కిరణ్ భట్టార్, లక్ష్మీనారాయణాచార్యులు, మహేషాచార్యులు, ఆలయ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షులు మారం నాగరాజ గుప్త, మేనేజింగ్ ట్రస్టీ పల్లెర్ల నాగరాజు తదితరులు పర్యవేక్షించారు.


సింహవాహనంపై శ్రీవారి విహారం


వాహనోత్సవంలో పాల్గొన్న నగర మహిళలు



ఆదర్శ కీర్తన

వెలుగోడు మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఓ యువతి మారుమూల గ్రామీణ ప్రాంతం నుంచి ఎస్ఐగా నియమితులయ్యారు. వెలుగోడు మండలంలోని గుంతకందాల గ్రామం వ్యవసాయ కుటుంబానికి చెందిన వెంకటేశ్వర్లు, సరోజిని దంపతుల రెండో కుమార్తె నాగ కీర్తన. ఈమె 1 నుంచి 7వ తరగతి వరకు స్వగ్రామం గుంతకందాల గ్రామంలోని ఎంపీయూపీ పాఠశాలలో చదువుకున్నారు. 8 నుంచి 10 వరకు వెలుగోడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంటర్ నలంద నంద్యాల కాలేజీలో డిగ్రీ నంద్యాల నేషనల్ కళాశాలలో చదువుకున్నారు. 2020 నుంచి మూడేళ్లు మిద్తూర్‌లో కానిస్టేబుల్‌గా పని చేశారు. ఎస్ఐగా శిక్షణ పూర్తి చేసుకున్న ఆమెను కడప జిల్లాకు కేటాయించారు.



సమాజంలో మహిళల పాత్ర కీలకం

\- జయమ్మ, డీడీ, సమాచార శాఖ



నేటి సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. సమాజంలో తమ వంతు పాత్ర పోషిస్తున్నారు. పరిపాలన, రాజకీయ రంగాల్లో మహిళలు భాగస్వామ్యం గణనీయంగా పెరిగి, కీలకమైన నిర్ణయాల్లో ప్రధానపాత్ర పోషించడం విశేషం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళకలు సమాన అవకాశాలు, హక్కులు కల్పిస్తూ మహిళల అభివృద్ధికి కృషి చేస్తున్నాయి. మహిళలకు గౌరవం పెంచేలా, సాధికారత దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో పథకాలు అమలు చేస్తున్నాయి. మహిళా శక్తి క్రమేణా పెరుగుతోంది. కర్నూలు జిల్లాలో కూడా కీలకమైన చాలా శాఖలో మహిళ అధికారులు వారి వారి శాఖలో చురుగ్గా సమర్థవంతంగా పని చేస్తున్నారు. ఆడపిల్లలు బాగా చదువుకుని తమ కుటుంబంతో పాటు సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలి.

\- కర్నూలు కలెక్టరేట్

మహిళలకు రక్షణ ఏదీ..?



కర్నూలు క్రైం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా గత ఐదేళ్లలో మహిళలపై నేరాలు పెరిగాయి. యువతులు, బాలికలపై లైంగిక దాడులు ఎక్కువయ్యాయి. గృహ హింస పెరిగింది. పోలీస్ స్టేషన్లకు వచ్చే బాధితురాళ్ల సంఖ్య పెరిగిపోయింది. గత ప్రభుత్వం దిశా చట్టం తెచ్చినా గత ఐదేళ్లలో మహిళల రక్షణకు పెద్దగా శ్రద్ధ చూపలేదు. వైసీపీ ప్రభుత్వం మహిళల కోసం కొత్త దిశా చట్టం తెచ్చింది. ఈ దిశా చట్టమే కొంత మంది పోలీసు అధికారులకు కాసుల వర్షం కురిపించింది. కొద్ది నెలల్లోనే కేసులు ట్రయల్‌కు వచ్చేలా చేస్తామని, నిందితులకు శిక్షలు పడేలా చేస్తామని చెప్పిన ప్రభుత్వం క్షేత్ర స్థాయిలో విఫలమైంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత దిశా పోలీస్ స్టేషన్‌ను రూపురేఖలు మార్చి తిరిగి మహిళా పోలీస్ స్టేషన్‌గా ఏర్పాటు చేసింది. గతంలో దిశా పోలీస్ స్టేషన్‌లో అంతా పురుషులే అధికారులుగా ఉండగా.. ఒకరిద్దరు మాత్రమే మహిళా పోలీసు అధికారులు ఉండేవారు. ప్రస్తుతం పురుషుల సంఖ్యను తగ్గిస్తూ మహిళా పోలీసుల సంఖ్యను పెంచుతున్నారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్ బాధ్యతలు చేపట్టిన తర్వాత మహిళలపై నేరాలు తగ్గించే దిశగా చర్యలు తీసుకుంటున్నారు.

అమ్మ, నాన్నల ప్రోత్సాహంతోనే...

● వెంకట నారాయణమ్మ, డీఆర్వో, కర్నూలు




మాది అనంతపురం జిల్లా. వ్యవసాయ కుటుంబం. అమ్మాయిలు చదువుకుంటేనే కుటుంబం బాగుంటుందని అమ్మా నాన్న ఆకాంక్షించేవారు. గమ్యం, ఉద్దేశం, లక్ష్యం ఏర్పరుచుకుని ప్రణాళిక ప్రకారం సిద్ధమవ్వాలి అని తల్లిదండ్రులు ఎప్పుడూ సూచించేవారు. వారి ఆలోచనలకు అనుగుణంగా కష్టపడి చదివి ఉద్యోగం సంపాదించుకున్నాను. నేటి తరం అమ్మాయిలు తల్లిదండ్రులు సూచనలు పాటిస్తూ ఉన్నత స్థానానికి ఎదగాలి. క్రమశిక్షణతో మెలగాలి. మహిళలు చదువుకుంటే సమాజం అభివృద్ధి చెందుతుంది.

-కర్నూలు కలెక్టరేట్

ఆధునిక మహిళ చరిత్రను తిరగరాస్తుంది

\- గురజాడ



- ఆత్మవిశ్వాసమే వనితల తొలిమెట్టు
- అన్ని రంగాల్లో మహిళలదే పైచేయి
- అయినా అక్కడక్కడా వివక్ష
- నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం

సాహో.. సబల..!

ఆకాశంలో సగం.. అన్నింటా సగం అన్నట్లుగా మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. పట్టుదలే ఆయుధమై సత్తా చాటుతున్నారు. ఇంతింతై ఉన్నత శిఖరాలు అధిరోహిస్తున్నారు. అందరికీ ఆదర్శంగా నిలిచి.. మహిళ అంటే అబల కాదు.. సబల అని నిరూపిస్తున్నారు. ప్రస్తుత సమాజంలో మహిళలు పురోగమిస్తూ అద్భుత విజయాలను సాధిస్తున్నారు. అత్యున్నత శిఖరాలను చేరుకుంటూ ఔరా అనిపిస్తున్నారు. విద్య, ఉద్యోగ, సామాజిక, ఆర్థిక రంగాల్లో మహిళల ప్రాధాన్యం గణనీయంగా పెరుగుతోంది. డిజిటలైజేషన్, సోషల్ మీడియా, సాఫ్ట్‌వేర్ దిగ్గజ సంస్థల్లో ఎందరో మహిళలు ప్రతిభా పాటవాలు చాటుతున్నారు. ఇదంతా నాణేనికి ఒక వైపు మాత్రమే. మరో వైపు అన్ని రంగాల్లోనూ మహిళలపై వివక్ష కొనసాగుతూనే ఉంది. ఇప్పటికీ ఇంటా, బయటా అణచివేతకు గురవుతున్నారు. ఎన్ని అవమానాలు ఎదురైనా, కష్టాలు అడ్డొచ్చినా ధైర్యంగా నిలుస్తూ అభాగ్యులకు ధైర్యాన్ని నూరిపోస్తున్నారు. కొందరు మహిళలు. అకుంఠిత దీక్షతో అపూర్వ విజయాలు సాధించి.. స్ఫూర్తిగా నిలుస్తున్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

అనాథల అమ్మ

- మదర్ థెరిస్సా స్ఫూర్తితో సేవలు
- జ్యోతి అనాథాశ్రమం నెలకొల్పిన ముత్తు లక్ష్మి
- 200 మంది అనాథ పిల్లలను చేరదీసిన ఆదర్శమూర్తి



అనాథ శిశువుతో ముత్తులక్ష్మి

మంత్రాలయం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ముత్తులక్ష్మమ్మ పేరు చెబితే అనాథలే గుర్తుకు వస్తారు. అనాథ చిన్నపిల్లల కోసమే తన జీవితాన్ని త్యాగం చేసిన మహనీయురాలు ఆమె. మంత్రాలయం మండలంలోని కాచాపురం గ్రామంలో అనాథ జ్యోతి ఆశ్రమం నిర్వహిస్తున్నారు. ఒక్క అనాథతో ప్రారంభమైన జ్యోతి ఆశ్రమం ఆ తరువాత 200 మందికి ఆశ్రయం ఇచ్చారు. ఊరు పేరు తెలియని చిన్నారులను చేరదీసి పెంచి పెద్ద చేసి ప్రయోజకులుగా చేస్తున్నారు. ఆమె పెళ్లి చేసుకోకున్నా ఎంతో మందికి పెళ్లిళ్లు చేశారు. వారికి పురుడు పోసి వారికి పుట్టిన పిల్లలను సైతం తన ఆశ్రమంలోనే చోటు కల్పించారు. ఆంజనేయ, మారెమ్మ దంపతులు ముంబైకి వలస వెళ్లడంతో అక్కడే 1949లో మూడో సంతానంగా ముత్తులక్ష్మి జన్మించారు. తొమ్మిదేళ్ల వయస్సులో ముంబైలోని ఆంధ్ర కింగ్స్ సర్కిల్ స్కూలుకు వచ్చిన మదర్ థెరిస్సాను చూసి ఆమె ఆదర్శంగా తీసుకున్నారు. 1969లో తన సొంత గ్రామమైన ఖగ్గలుకు వచ్చి తనకున్న 2.40 ఎకరాల్లో.. 40 సెంట్లలో అనాథాశ్రమం స్థాపించారు. రెండెకరాల్లో పండించిన పంటలతో పిల్లలను పోషిస్తున్నారు. 1981లో జ్యోతి ఆశ్రమాన్ని స్థాపించి 76 ఏళ్ల ముత్తులక్ష్మి 44 ఏళ్లుగా 32 పెళ్లిళ్లు చేసి 200 మందిని పెంచి పెద్ద చేశారు. ప్రస్తుతం 35 మంది విద్యార్థులతోపాటు వృద్ధులు, వితంతువులు, మానసిక వికలాంగులు, ఇక్కడ ఆశ్రయం పొందుతున్నారు.

ఆదర్శమూర్తి

- పిల్లలను ఉన్నతంగా తీర్చిదిద్దిన లక్ష్మమ్మ
- ఓ కుమారుడు ఐఏఎస్
- మరో కుమారుడు ఏపీఎస్‌పీడీసీఎల్‌లో ఈఈ
- కుమార్తె ఎల్ఐసీలో ఏఏవో



అవుకు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): లక్ష్య సాధన దిశగా అడుగులు వేస్తున్నప్పుడు కొన్ని అపజయాలు ఎదురవుతాయి. అవి అపజయాలు కాదని, అనుభవాలు అని తెలుసుకున్న వారు అనుకున్నది సాధిస్తారు. ఒక్కో ఓటమిని గెలుపునకు మెట్టుగా మార్చుకొని ఎదుగుతారు. సమాజ నిర్మాణంలో భాగస్వాములవుతారు. ఈ కోవకు చెందిన మహిళే నంద్యాల జిల్లా అవుకు పట్టణానికి చెందిన లక్ష్మమ్మ. నిరుపేద గిరిజన కుటుంబంలో జన్మించి అట్టడుగు స్థాయి నుంచి అంచలంచెలుగా ఎదిగారు. పిల్లలను ఉన్నతంగా తీర్చిదిద్ది నారీ లోకానికి ఆదర్శంగా నిలిచారు. అవుకు మండలంలోని సీతమ్మ తండాకు చెందిన దాసన్న, సుబ్బమ్మ దంపతుల కూతురు లక్ష్మమ్మ. వీరు సీతమ్మ తండా నుంచి 60 సంత్సరాల క్రితం అవుకుకు వచ్చి స్థిరపడ్డారు. ఆవులను కాసుకుంటూ వాటికి వచ్చే రోగాలకు నాటు వైద్యం చేస్తూ జీవనం సాగించేవారు. కూతురు లక్ష్మమ్మకు చదువుపై ఉన్న ఆసక్తిని గమనించి అప్పట్లోనే 10వ తరగతి వరకు చదివించారు. 1965లో లక్ష్మమ్మకు గడివేముల మండలం లక్ష్మయ్యకుంట తండా (ఎల్కే తండా)కు చెందిన రాముడితో వివాహం జరిగింది. వీరికి సౌభాగ్య శిరోమణి బాయి, హరిశే వియా నాయక్, తిరుమలనాయక్ సంతానం.

ఏఎన్ఎంగా విధుల్లో చేరి : లక్ష్మమ్మ 1970లో ప్యాపిలి మండలం జలదుర్గం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏఎన్ఎంగా నెలకు రూ.188 వేతనంతో ఉద్యోగంలో చేరింది. 1982లో పదోన్నతి పొంది ఉయ్యాలవాడ పీహెచ్‌సీలో హెల్త్‌సూపర్‌వైజర్‌గా విధులు నిర్వర్తించారు. 2002లో పదోన్నతిపై కడప జిల్లా వద్దిరాల పీహెచ్‌సీలో పీహెచ్ఎన్‌గా పని చేశారు. 2007లో ఉద్యోగం నుంచి రిటైర్ అయ్యారు. దాదాపు 37 సంవత్సరాల పాటు గర్భిణులకు ప్రసవ సమయాల్లో వైద్యసేవలు అందించారు. భర్త రాముడు పిల్లల భవిష్యత్‌ను పట్టించుకోకపోయినా లక్ష్మమ్మ మొక్కవోని ధైర్యంతో కష్టపడి పిల్లల భవిష్యత్‌కు బంగారు బాటలు వేసింది. మొదటి సంతానమైన కుమార్తె సౌభాగ్య శిరోమణిబాయి అనంతపురం జిల్లా ధర్మవరం పట్టణంలోని ఎల్ఐసీ ఆఫీసులో ఏఏఓగా, రెండో కుమారుడు హరిశేవియా నాయక్ కడపలో ఏపీఎస్‌పీడీసీఎల్‌లో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా, మూడో కుమారుడు తిరుమలనాయక్ ఒడిశా రాష్ట్రంలో ఐఏఎస్‌గా అధికారిగా పని చేస్తున్నారు. భువనేశ్వర్ డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ చైర్మన్‌గా బాధ్యతలను నిర్వహిస్తున్నారు.

మదిలో మెదిలిన కలలే నిజమాయే...

తన కలలు నిజమయ్యాయని లక్ష్మమ్మ ఆనందం వ్యక్తం చేశారు. ప్రతి మనిషి విజయం వెనుక తల్లిగా, భార్యగా మహిళ ఉంటుందని ఆమె అంటారు. లక్ష్మమ్మ తన పిల్లల విజయానికి జీవితమంతా కృషి చేశారు. ఓవైపు ఏఎన్ఎంగా విధులు నిర్వహిస్తూ మరో వైపు కుటుంబాన్ని పోషించుకుంటూ పిల్లలను ఉన్నతంగా తీర్చిదిద్దారు. విధి నిర్వహణలో ప్రజలకు సేవ చేస్తూనే తన పిల్లలకు మంచి భవిష్యత్‌ను అందించి ఇంటా బయట గుర్తింపు తెచ్చుకున్నారు.



రిటైర్‌మెంట్ సన్మాన సభలో తల్లి లక్ష్మమ్మను సన్మానిస్తున్న కుమారుడు తిరుమలనాయక్ (ఫైల్)

స్త్రీలు శక్తిసంపన్నులు : కలెక్టర్



నంద్యాల నూనెపల్లె, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): జన్మతః మహిళలు శక్తిమంతులని కలెక్టర్ రాజకుమారి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం కలెక్టర్ చాంబర్‌లో ఆమె జిల్లా మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు ఉన్నత వ్యక్తిత్వంతోపాటు ఆత్మాభిమానం కలిగి ఉంటారని కుటుంబ బాధ్యతలతోపాటు ఉద్యోగ, వ్యాపార, రాజకీయ, ఇతర రంగాల్లో స్థిరపడాలన్నా, విజయాలు సాధించడంలో మహిళల కష్టం స్ఫూర్తిదాయకమన్నారు. సమాజంలో స్థిరపడిన మహిళా పారిశ్రామికవేత్తలు పది మందికి ఉపాధి కల్పించే రీతిలో ఉండాలని ఆమె ఆకాంక్షించారు. నేటి తరం పిల్లలకు మంచి భవిష్యత్ అందించాల్సిన బాధ్యత కూడా మహిళలపైనే ఉందన్నారు. మగ, ఆడ పిల్ల తారతమ్యలేకుండా సమాన స్థాయిలో పెంచి ఉత్తమ పౌరులుగా దేశ, రాష్ట్ర భవిష్యత్‌లో చక్కటి భాగస్వామ్యం పంచాలని సూచించారు. లింగ వ్యవస్థపై చట్టాలున్నప్పటికీ నిరాశ్రయులైన అనాథపిల్లలకు సమగ్ర శిశు సంరక్షణ కేంద్రాలున్నాయని తెలిపారు.




స్త్రీలు చదువుకుంటే కుటుంబంలో, సమాజంలో ఉన్న చీకట్లు తొలగిపోతాయి.

\- సావిత్రిబాయి పూలే

ఆదోని ఆణిముత్యం

భారత క్రికెట్ మహిళా జట్టులో అంజలి శార్వాణి



బ్యాటింగ్ చేస్తున్న క్రికెటర్ అంజలి శార్వాణి

ఆదోని అగ్రికల్చర్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : ఆడపిల్ల తలచుకుంటే ఏ రంగంలోనైనా దూసుకుపోగలదని నిరూపించింది. పట్టుదలతో శ్రమిస్తే లక్ష్యాన్ని సాధించగలరని చాటి చెప్పింది. భారత మహిళా క్రికెట్ జట్టుకు ఎంపికైన తనకంటూ ఓ గుర్తింపు తెచ్చుకుంది. క్రికెట్ ఆల్ రౌండర్ రాణిస్తూ ఎంతో మంది యువతకు స్ఫూర్తిగా నిలిచింది. భారత జట్టు క్రికెటర్ ఆదోని ఆణిముత్యం కేశవరాజు గారి అంజలి శార్వాణిపై మహిళ దినోత్సవం ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

● అథ్లెటిక్ నుంచి క్రికెటర్‌గా

ఆదోని పట్టణానికి చెందిన ఉపాధ్యాయుడు రమణ, అనూరాధ దంపతుల కూతురు అంజలి శార్వాణి పాఠశాల స్థాయి నుంచి అథ్లెటిక్‌పై శ్రద్ధ చూపేవారు క్రమంగా క్రికెట్ వైపు అడుగులు వేశారు. తల్లిదండ్రులు తన తొలి గురువు వెంకటేష్ ప్రోత్సాహంతో క్రికెట్లో రాణిస్తూ జిల్లా, రాష్ట్ర, సౌత్ ఇండియా, జాతీయ క్రికెట్ స్థాయిలో రాణిస్తూ తనకంటూ గుర్తింపు తెచ్చుకుంది. సౌత్ ఇండియా అండర్-19 జట్టు కెప్టెన్‌గా వ్యవహరించారు. ఆ పోటీలో ఆల్ ఇండియా చాంపియన్‌షిప్ సాధించారు. ఇండియా మహిళా క్రికెట్ జట్టుకు ప్రాతినిధ్యం వహించాలని సంకల్పంతో సాధన చేశారు. అలా అవకాశాన్ని అందిపుచ్చుకొని బాంగ్లాదేశ్, శ్రీలంకతో జరిగిన టెస్ట్ మ్యాచ్ ఆడి తానేంటో నిరూపించుకుంది. ప్రస్తుతం తాను మహిళా యూపీ వారియర్స్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తూ ఆల్ రౌండర్‌గా రాణిస్తున్నారు.

● 2009 సౌత్ ఇండియా అండర్-16 ఆంధ్ర జట్టుకు అంజలి శార్వాణి ప్రాతినిధ్యం వహించారు. ఆ ఏడాది జట్టు చాంపియన్ షిప్ సాధించింది.

● 2015లో సౌత్ ఇండియా అండర్-19 జట్టుకు తొలిసారిగా ఎంపికై కెప్టెన్‌గా వ్యవహరించారు.

● 2018లో అండర్-23 చాలెంజర్ ట్రోఫీ కైవసం చేసుకున్నారు. భారత గ్రీన్ టీం ఎంపిక సౌత్ ఇండియా వివిధ రాష్ట్రాల అవకాశం దక్కించుకొని ప్రతిభ కనబరిచింది. ప్రభుత్వం గుర్తించి రైల్వే శాఖలో ఉద్యోగం కల్పించింది. అప్పటి నుంచి రైల్వే క్రికెట్ టీంలో ఆడుతూ తన ప్రతిభను నిరూపించుకుంది. ఆంధ్ర జట్టుకు ప్రాతినిధ్యం కూడా వహించారు. సెంట్రల్‌లో జోన్‌కు జరిగిన మ్యాచ్‌లో చాంపియన్‌షిప్ కౌవసం చేసుకుంది. ఏ-టీం తరఫున ప్రాతినిధ్యం వహించి అత్యధికంగా 27 వికెట్లు సాధించి రికార్డ్ నెలకొల్పింది. దీంతో బీసీసీఐ కంట్లో పడడంతో భారత మహిళా జట్టుకు ఎంపికై 2023 డిసెంబర్‌లో ఆస్ట్రేలియాతో తలపడి తనకంటూ గుర్తింపు తెచ్చుకుంది.



అడవికి అండగా ఆమె

- విధి నిర్వహణలో ధైర్య సాహసాలు
- వన, వన్యప్రాణి సంరక్షణలో ఉత్తమ సేవలు
- ఉన్నతాధికారుల నుంచి ప్రశంసా పత్రాలు

కర్నూలు రాజ్‌విహార్ సర్కిల్ మార్చి 7 (ఆంధ్రజ్యోతి): అటవీ సంరక్షణలో పురుషులతో సమానంగా మహిళలు అడవి తల్లికి అండగా నిలుస్తున్నారు. సహచర ఉద్యోగులతో సమన్వయంగా విధుల్లో చక్కగా రాణిస్తున్నారు. కర్నూలు నగరానికి చెందిన రేణుక వ్యవసాయ కుటుంబంలో జన్మించారు. కష్టపడి చదివి అటవీ శాఖలో 2011లో ఫారెస్టు బీట్ అధికారిగా నియమితులయ్యారు. అక్రమాలకు అడ్డుకట్ట వేసే క్రమంలో ఈమె ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు.. ఈ క్రమంలో అక్రమార్కుల నుంచి భౌతిక దాడులు సైతం జరిగాయి. ఒంటరిగా ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఆమెపై కారం పొడి చల్లి దాడి చేసినా రేణుక చలించలేదు. యెనగండ్లలో అరుదైన తాబేళ్లను అక్రమంగా తరలిస్తున్న వారిని మఫ్టీలో వెళ్లి పట్టుకున్నారు. ఇందుకు త్వరలోనే కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రత్యేకమైన ప్రశంసాపత్రం రూ.1000 రివార్డు అందుకోనున్నారు. అలాగే శకుంతల అనే మరో మహిళ 2011లో ఫారెస్టు బీట్ అధికారిగా అటవీశాఖలోకి ప్రవేశించారు. వన్యప్రాణి సంరక్షణలో ప్రత్యేక శ్రద్ధ కనబరిచారు. అర్ధరాత్రుల్లో ప్రమాదాలకు గురైన జింకలు, నెమళ్లను పరిరక్షించారు.



రేణుక

● ప్రధానంగా సిద్దనగట్టు రిజర్వు ఫారెస్టులో నాలుగు దశాబ్దాలుగా పరాయి ఆధీనంలో 20 ఎకరాల అటవీ భూమి ఉండేది. దాన్ని ఖాళీ చేయించి అటవీశాఖ స్వాధీనం చేసుకునేలా చేశారు.

● రామళ్లకోట సమీపంలో అటవీ భూములు అన్యాక్రాంతం అవుతుండగా, వాటిని అడ్డుకున్నారు. రాజకీయ బెదిరింపులు, ప్రలోభాలు ఎదురయినా, వాటిని ధైర్యంగా ఎదుర్కొని, ఉన్నతాధికారుల సహకారంతో ఈ పన్నాగానికి అడ్డుకట్ట వేశారు.

● శకుంతల అందించిన ఈ సేవలకు గాను 2025 రిపబ్లిక్ డేను పురస్కరించుకుని కలెక్టర్ నుంచి ప్రశంసా పత్రం అందుకున్నారు.



కలెక్టర్ నుంచి ప్రశంసా పత్రం అందుకుంటున్న శకుంతల

వెలుగులోకి భూ కబ్జాలు

ఆదోని అంటే గుర్తుకొచ్చేది భూ కబ్జాలే. వైసీపీ హయాంలో భూ అక్రమార్కులు పెట్రేగిపోయారు. రెవెన్యూ రికార్డులను మాయ చేశారు. ఒకే భూమిని పలువురు పేరిట అక్రమ రిజిస్ట్రేషన్లు చేయించారు. అప్పటి కీలక ప్రజాప్రతినిధి అండతో భూ కబ్జాలు పెరిగిపోయాయి. పట్టణంలో అంతర్భాగమైన సాదాపురం పంచాయతీ పరిధిలోని సర్వే నంబరు 352లో భారీఎత్తున భూ అక్రమాలు జరిగాయి. వీటిని నిగ్గు తేల్చాలంటే వైసీపీ హయాంలో వెలుగు చూసిన భూ ఆక్రమణలు, డబుల్ రిజిస్ట్రేషన్లు, ప్రభుత్వ భూ సేకరణలపై సమగ్ర విచారణ చేయించాలని ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి రాష్ట్ర విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌కు ఫిర్యాదు చేశారు. ఇప్పటికే డాణాపురం వద్ద జగనన్న కాలనీ పేరిట జరిగిన భూ సేకరణ కుంభకోణంపై విచారణ చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషాకు ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే ఫిర్యాదుతో భూ అక్రమార్కుల గుండెల్లో దడ మొదలైంది.

- వైసీపీ హయాంలో అక్రమాలు
- ఆదోనిలో ఒకే భూమి పలువురికి రిజిస్ట్రేషన్
- రెవెన్యూ రికార్డులు తారుమారు
- సర్వే నంబరు 352 భూముల్లో అక్రమార్కుల పంజా
- మంత్రులకు ఫిర్యాదు చేసిన ఎమ్మెల్యే పార్థసారథి



ఆదోనిలో వివాదంగా మారిన సర్వే నంబరు 352లోని భూములు

కర్నూలు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఆదోని పట్టణంలో అంతర్భాగమైన సాదాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని సర్వే నంబరు.352, మండిగిరి పంచాయతీ పరిధిలోని సర్వే నంబరు.444 కింద ఉన్న భూముల్లో గత వైసీపీ హయాంలో భూ అక్రమార్కులు పెద్దఎత్తున రెవెన్యూ రికార్డులు తారుమారు చేసి భూ అక్రమాలు, కబ్జాలకు పాల్పడ్డారు.. సమగ్ర విచారణ చేసి అక్రమార్కులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి మంత్రులు నారా లోకేశ్, అనగాని సత్యప్రసాద్‌లకు ఫిర్యాదులు చేశారు. సాదాపురం రెవెన్యూ గ్రామం పరిధిలో సర్వే నంబరు.352లో రీ-సెటిల్‌మెంట్ రిజిస్టర్ ప్రకారం 38.35 ఎకరాలు విస్తీర్ణం చూపిస్తున్నారు. ఆన్‌లైన్ అడంగల్‌లో 52.20 ఎకరాలు చూపిస్తోంది. రీ-సెటిల్‌మెంట్ రిజిస్టర్‌ను కాదని 15.82 ఎకరాలు భూమి అదనంగా ఎలా వచ్చింది..? అలాగే మండిగిరి పంచాయతీ పరిధిలో సర్వే నంబరు.444 కింద రీ-సెటిల్‌మెంట్ రిజిస్ట్రేషన్ (ఆర్ఓఆర్) రికార్డుల ప్రకారం 53.58 ఎకరాల భూ విస్తీర్ణం చూపిస్తే.. ఆన్‌లైన్ అడంగల్‌లో 79.5 ఎకరాలు చూపిస్తుంది. 25.92 ఎకరాలు భూమి ఆన్‌లైన్‌లో అదనంగా ఎలా వచ్చింది..? అన్నది వైసీపీ హయాంలో పని చేసిన రెవెన్యూ అధికారులకు తెలియాలి. ఇక్కడ ఎకరం రూ.10-15 కోట్లకు పైగా పలుకుతుంది. డబుల్ రిజిస్ట్రేషన్లు, మిస్సింగ్ రిజిస్ట్రేషన్లు, క్రయ విక్రయాల వివరాలు తారుమారు చేసినట్లు స్పష్టంగా తెలుస్తోంది. ల్యాండ్ కన్వర్షన్, ఎస్‌ఏ చేసిన రికార్డులు లేవని, ఇప్పటికీ భూమిని లే-అవుట్లు వేసి స్థిరాస్తి వ్యాపారాలు, నిర్మాణాలు చేస్తున్నారని వివరించారు. అంతేకాదు సర్వే నంబరు.352లో తమకున్న ఎకరం భూమి ఆక్రమించారని, న్యాయం చేయాలని కోరుతూ బాధితులు అయ్యప్ప, ఎం.నరసింహులు జాతీయ సెడ్యూల్ కులాల కమిషన్‌లో ఫిర్యాదు చేశారని గుర్తు చేశారు.

● ఏ ఒక్కరినీ వదలిపెట్టం



విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌కు ఫిర్యాదు చేస్తున్న ఎమ్మెల్యే పీవీ పార్థసారథి

వైసీపీ ప్రభుత్వ హయాంలో అధికారాన్ని అడ్డు పెట్టుకొని వ్యవస్థీకృత భూ అక్రమాలకు పాల్పడ్డారు. నేను ఎమ్మెల్యేగా ఏ వీధికి వెళ్లినా సర్వే నంబరు.352 బాధితులు ఏకరువు పెడుతున్నారు. 352, 444 సర్వే నంబర్లలో జరిగిన భూ అక్రమాలు, రికార్డుల తారుమారు, కబ్జాలపై విచారణ చేయాలని మంత్రులు నారా లోకేశ్, అనగాని సత్యప్రసాద్‌లకు ఫిర్యాదు చేశాను. డాణాపురం వద్ద జగనన్న కాలనీ కోసం తీసుకున్న భూ సేకరణలో భారీ అక్రమాలు జరిగాయి. వైసీపీ నాయకులు పక్కా ప్రణాళికతో రైతులతో తక్కువ ధరకు భూములు మాట్లాడుకొని.. ప్రభుత్వానికి ఎక్కువ రేట్లకు ఇచ్చి ఇటు రైతులు, అటు ప్రభుత్వాన్ని మోసం చేశారు. భూ అక్రమాలకు పాల్పడిన ఏ ఒక్కరిని కూడా వదిలిపెట్టే ప్రసక్తి లేదు.

\- పార్థసారథి, ఆదోని ఎమ్మెల్యే

సచివాలయ ఉద్యోగులకు నేడు శిక్షణ

కర్నూలు న్యూసిటీ, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ఏపీ పంచాయతీ రాజ్ అండ్ గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు స్వామిత్వ రీసర్వే ప్రాజెక్టులో భాగంగా శనివారం జడ్పీ ఆవరణలోని డీపీఆర్‌సీ భవనంలో శిక్షణ ఇవ్వనున్నట్లు కర్నూలు డివిజనల్ పంచయతీ అధికారి లక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. డివిజన్‌లో పైలట్ ప్రాజెక్టు కింద ఎన్నుకున్న ఏడు మండలాల్లో ఒక్కో గ్రామపంచాయతీ నుంచి ఇంజనీరింగ్ అసిస్టెంట్లు(4), డిజిటల్ అసిస్టెంట్లు(3) పంచాయతీ కార్యదర్శులు(3) శిక్షణకు హాజరు కావాలన్నారు. సర్వే జరిగే ప్రక్రియ సంబంధిత గ్రామ సర్వేయర్‌తో కలిసి రోవర్ ఆపరేషన్, పాయింట్లు పికప్, అసైనింగ్ చలానా నెంబరు 36 కాలమ్ డేటాను సేకరించాలన్నారు. సి.బెళగల్(సి.బెళగల్), చనుగొండ్ల(గూడూరు మండలం), పర్ల(కల్లూరు), ఎర్రదొడ్డి(కోడుమూరు), ఈ.తాండ్రపాడు(కర్నూలు), మీదివేములు(ఓర్వకల్లు), గోవర్ధనగిరి(వెల్దుర్తి)ని ఎంపిక చేసినట్లు తెలిపారు. అసిస్టెంట్ డైరెక్టర్ సర్వే శాఖ అధ్వర్యంలో ఒక్కరోజు శిక్షణ ఉంటుందన్నారు.

16న జడ్పీ సర్వసభ్య సమావేశం

కర్నూలు న్యూసిటీ, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లా పరిషత్ సర్వసభ్యసమావేశం ఈ నెల 16న నిర్వహించనున్నట్లు జిల్లా పరిషత్ సీఈవో జి.నాసరరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జడ్పీ సమావేశ భవనంలో ఉదయం 11 గంటలకు చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అధ్యక్షతన జరిగే సమావేశానికి మంత్రులు, ఉమ్మడి జిల్లాల కలెక్టర్లు, అధికారులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు హాజరు కానున్నట్లు ఆయన తెలిపారు. గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్యం, వ్యవసాయ శాఖ, జలవనరుల శాఖ, బడ్జెట్-జడ్‌పీపీ అండ్ ఎంపీపీ 2025-26లపై చర్చ ఉంటుందని చెప్పారు. సమావేశానికి ఉమ్మడి జిల్లాల జడ్పీటీసీలు, ఎంపీపీలు హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

పత్తికొండ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఆటోను మోటార్‌సైకిల్ ఢీకొన్న సంఘటనలోముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. అనంతపురం జిల్లా వజ్రకరూర్ సమీపంలో వెంకటాంపల్లి తండాకు చెందిన రాజూనాయక్, రామూనాయక్, బీమానాయక్ బంధువు మృతిచెందడంతో శుక్రవారం పత్తికొండ మండలపరిధిలోని పెండ్లిమాన్ తాండాకు మోటార్‌సైకిల్‌పై వచ్చారు. కార్యక్రమం ముగించుకుని రాత్రి తిరిగి వెంకటాంపల్లి తండాకు మోటార్‌సైకిల్‌పై బయలుదేరారు. పత్తికొండ చెరువుసమీపంలో కొలాయిబావివద్ద ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొనడంతో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని 108 అంబులెన్స్‌లో పత్తికొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

600 సెల్‌ఫోన్లు రికవరీ

● బాధితులకు అప్పగింత



బాధితులకు మొబైల్ ఫోన్లు అందజేస్తున్న ఎస్పీ

కర్నూలు క్రైం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా పోలీస్ కార్యాలయంలోని పెరేడ్ మైదానంలో మొబైల్ రికవరీ మేళాను శుక్రవారం నిర్వహించారు. ఈ మేళాకు ఎస్పీ విక్రాంత్ పాటిల్ పాల్గొని బాధితులకు రికవరీ చేసిన మొబైల్ ఫోన్లను అందజేశారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రూ.1.20 కోటి విలువ చేసే 600 మొబైల్ ఫోన్లను రికవరీ చేశామన్నారు. ప్రజలు రైల్వే స్టేషన్లు, జాతరలు, పాఠశాలలు, కళాశాలల్లో తమ మొబైల్ ఫోన్లను పోగొట్టుకుంటున్నారన్నారు. మహారాష్ట్ర, తమిళనాడు, చెన్నై, హైదరాబాద్ పలు జిల్లాల నుంచి రికవరి చేసేందుకు కృషి చేసిన ప్రతి ఒక్క పోలీసును, ల్యాబ్ పోలీసులను అభినందించారు. ఇటీవల కాలంలో మొబైల్ ఫోన్లు మన జీవితంలో ఒక భాగంగా ఉందన్నారు. ప్రతి రోజు ప్రతి పనిలో మొబైల్ ఉపయోగం ఉంటుందన్నారు. ఫోన్‌కు సంబంధించిన పర్సనల్ వివరాలు, ఫోన్ నెంబర్లు, వ్యాపార లావాదేవీలు, అటాచ్‌మెంట్స్, సెంటిమెంట్స్, ఆన్‌లైన్ బ్యాంకు ఖాతా వ్యవహారాలు ఇలా చాలా మిస్ అవుతుంటాయన్నారు. ఎవరైనా తమ ఫోన్ పోగొట్టుకుంటే వెంటనే కర్నూలు వెబ్‌సైట్ Http://kurnool police.in/mobilethef వెళ్లి పోగొట్టుకున్న మొబైల్ ఐఎంఈఐ వివరాలు తెలియజేస్తే సెల్‌ఫోన్ రికవరీ చేసేందుకు పోలీసులు కృషి చేస్తారన్నారు. ఈ-పోలీస్ సేవకు ఎలాంటి రుసుం చెల్లించకుండా ఉచితం అని చెప్పారు. అడిషనల్ ఎస్పీ అడ్మిన్ హుశేన్‌పీరా, డీఎస్పీ బాబు ప్రసాద్, ఏఆర్ డీఎస్పీ భాస్కర్ రావు, సీఐలు తేజామూర్తి, అబ్దుల్‌గౌస్, రామయ్య నాయుడు, నాగరాజారావు, సైబర్ ల్యాబ్ సీఐ వేణుగోపాల్, టెక్నీషియన్ బృందాల సభ్యులు పాల్గొన్నారు.

పాముకాటుతో వ్యక్తి మృతి

వెల్దుర్తి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తి పాముకాటుకు గురై మృతి చెందాడు. మండలంలో లక్ష్మంపల్లె గ్రామానికి చెందిన బోయ రామాంజనేయులు(46) శుక్రవారం తెల్లవారుజామున బహిర్భూమికి వెళ్లిన సమయంలో పాము కాటువేసింది. ఇంటికి వచ్చి కుటుంబ సభ్యులకు తెలిపాడు. కుటుంబ సభ్యులు స్థానికుల సహాయంతో ఆటోలో వెల్దుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మార్గమధ్యంలో చనిపోయినట్లు నిర్ధారించారు. పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు. భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

సూదేపల్లెలో అగ్ని ప్రమాదం

వెల్దుర్తి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని సూదేపల్లెలో శుక్రవారం అగ్ని ప్రమాదం జరిగి రూ.3 లక్షల ఆస్తి నష్టం జరిగింది. ఉన్నపలంగా మంటలు చెలరేగి రమణారెడ్డి, పుల్లారెడ్డి, భూమిరెడ్డి పొలాలకు వ్యాపించాయి. అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. అంతలోపు రైతులు మంటలార్పే ప్రయత్నం చేశారు. రమణారెడ్డి పొలంలోని మునగపంట, డ్రిప్ పరికరాలు, మోటార్లు, స్టార్టర్ బాక్సులు అగ్నికి ఆహుతయ్యాయి. పుల్లారెడ్డి, భూమిరెడ్డి పొలంలో ఉన్న సొప్ప వాము, వరిగడ్డి వాము, రెండు మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ వైర్లు కాలిపోయాయి. రూ.3 లక్షల ఆస్తి నష్టం సంభవించిందని, ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరారు.

పని భారం తగ్గించాలి

- యూఎఫ్‌బీయూ జిల్లా కన్వీనర్ నాగరాజు
- ఈ నెల 24, 25 దేశవ్యాప్త సమ్మెకు పిలుపు



యూబీఐ ముందు ధర్నా చేస్తున్న వివిధ బ్యాంకుల ఉద్యోగులు

కర్నూలు కల్చరల్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): పదేళ్లుగా బ్యాంకులో ఏర్పడిన లక్ష ఉద్యోగ ఖాళీలను తక్షణం ఉద్యోగ నియామకాలు చేపట్టి, బ్యాంకుల్లో అధికారులు, సిబ్బందికి పని భారం తగ్గించాలని యూఎఫ్‌బీయూ (యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్) జిల్లా కన్వీనర్ ఇ.నాగరాజు కోరారు. నగరంలోని గాయత్రి ఎస్టేట్‌లోని యూబీఐ, బుధవారపేట శాఖ కార్యాలయం ఎదుట శుక్రవారం వివిధ బ్యాంకులకు చెందిన ఉద్యోగులు నిరసన ధర్నా చేపట్టారు. బ్యాంకుల్లో పనిభారం తగ్గించేందుకు, ఖాళీగా ఉన్న ఉద్యోగాలు భర్తీ చేసేందుకు, బ్యాంకు ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధనకు ఈనెల 24, 25 తేదీలలో దేశవ్యాప్త సమ్మెకు యూనియన్ల నాయకులు పిలుపునిచ్చారు. నాగరాజు మాట్లాడుతూ వారానికి 5 రోజుల పనిదినాలు కల్పించాలని, తాత్కాలిక ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, అవేట్ సోర్సింగ్ ఉద్యోగాలు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఐబీఏతో చేసుకున్న ఒప్పందం ప్రకారం మిగిలిన బ్యాంకు ఉద్యోగుల కోరికలను నెరవేర్చాలని, కేంద్ర ప్రభుత్వ విధానంలాగే గ్రాట్యూటీ రూ.25 లక్షలు పెంచి, ఇన్‌కమ్ ట్యాక్ రాయితీ ఇవ్వాలని, బ్యాంకు ఉద్యోగులపై జరుగుతున్న దాడుల నివారణకు బ్యాంకు యాజమాన్యాలు, కేంద్ర ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకొని, ఉద్యోగులకు భద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐబీఈఏ నాయకులు శివకృష్ణ, ఎల్లయ్య, కృష్ణమోహన్, ఏఐబీఓసీ నాయకులు మురళీకృష్ణ, ఎన్‌సీబీఈ నాయకులు విద్యాసాగర్, ప్రవీణ్, శ్రీకాంత్, ఏపీజీబీ యూనియన్ నాయకులు పాల్గొని ప్రసంగించారు.

పట్టపగలే చోరీ

● దొంగను పట్టుకొని చెట్టుకు కట్టేసి దేహశుద్ధి చేసిన స్థానికులు



దొంగ చేతిలో బంగారు ఆభరణాలు



చెట్టుకు కట్టేసిన దొంగను విడిపిస్తున్న పోలీసు

ఆదోని, ఆదోని రూరల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : ఓ ఇంట్లో దొంగతనం చేసి పారిపోతున్న దొంగను స్థానికులు పట్టుకొని చెట్టుకు కట్టేసి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఈ ఘటన ఆదోని పట్టణంలోని వైపీఆర్ కాలనీలో శుక్రవారం పట్టపగలు జరిగింది. స్థానిక మార్కెట్ యార్డులో కమీషన్ ఏజెంట్‌గా పత్తి వ్యాపారం చేస్తూ, ఆదోని పట్టణంలోని వైపీఆర్ కాలనీలో నివాసం ఉంటున్న గూళ్యం రమేష్, కుటుంబ సభ్యులు ఉదయం 11 గంటల తర్వాత ఇంటికి తాళం వేసి ఆస్పత్రికి బయల్దేరారు. ఇది గమనించిన ఆదోని పట్టణం ఎల్‌బీ స్ట్రీట్‌కు చెందిన ఖాజామొహినుద్దీన్ అనే వ్యక్తి ఇంటికి ఉన్న తాళాన్ని పెకలించి లోపలికి వెళ్లాడు. ఇంట్లో ఉన్న బీరువాను పగులగొట్టి 7తులాల బంగారు, 9 తులాల వెండి ఆభరణాలను దొంగలించాడు. దొంగ ఇంట్లో ఉండగానే అదే సమయంలో ఆసుపత్రికెళ్ళిన రమేష్ కుటుంబ సభ్యులు ఇంటికి చేరుకున్నారు. ఇంటి తలుపులు తెరిచి ఉండటం గమనించి అవాక్కయ్యారు. ఇంతలో లోపల ఉన్న దొంగ ఇంట్లోంచి ఒక ఉదుటన బయటకు పరుగు తీశాడు. రమేష్ కుమారుడు కార్తీక్ దొంగ దొంగ అని గట్టిగా కేకలు వేయడంతో కాలనీవాసులు దొంగను వెంబడించి పట్టుకొని తాడుతో చెట్టుకు కట్టేసి దేహశుద్ధి చేశాడు. దొంగ దగ్గర ఆభరణాలు కనిపించాయి. అనంతరం స్థానికులు తాలుక పోలీసులకు దొంగను అప్పగించారు. అయితే ఎస్ఐ రామాంజనేయులు మాట్లాడుతూ తమ దగ్గరికి దొంగతనం కేసు రాలేదని, దొంగను ఎవరూ అప్పగించలేదని సమాధానం ఇచ్చారు. ఈ విషయంపై సీఐ నల్లప్పను ఆంధ్రజ్యోతి పలకరించగా దొంగను కాలనీ వాసులు పట్టుకొని తమకు అప్పగించిన మాట వాస్తవమేనని, రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని వివరణ ఇచ్చారు.



డిప్యుటేషన్ డ్యూటీ..!

- రుద్రవరం వదిలి చాగలమర్రిలో విధులు
- అక్కడ ఒకేషనల్ టీచర్ ఉన్నా నియామకం
- ఐదేళ్లుగా రెగ్యులర్ స్థానం ఖాళీ



నంద్యాల, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా సర్వశిక్షా అబియాన్ పరిధిలోని ఓ కేజీబీవీలో పని చేస్తున్న ఒకేషనల్ టీచర్ ప్రజాప్రతినిధుల అండదండలతో డిప్యుటేషన్ పొందారు. ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా ఐదేళ్లకు పైగా డిప్యుటేషన్‌పై విధులు నిర్వహిస్తున్నారు. అక్కడ రెగ్యులర్ టీచర్ ఉన్నప్పటికీ సదరు ఒకేషనల్ టీచర్ పైరవీలు చేసి డిప్యుటేషన్ తెచ్చుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. తాజాగా సంబంధిత ప్రిన్సిపాల్ ఫిర్యాదు చేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది.

● ఎందుకంత ప్రేమో...

ఆళ్లగడ్డ నియోజకవర్గ పరిధిలోని రుద్రవరం కేజీబీవీలో ఓ ఒకేషనల్ టీచర్ పని చేస్తున్నారు. అయితే సదరు టీచర్ 2017-19, 2021 నుంచి ఇప్పటి వరకు డిప్యుటేషన్‌పై అదే నియోజకవర్గ పరిధిలోని చాగలమర్రి కేజీబీవీలో పని చేస్తున్నారు. చాగలమర్రిలో ఖాళీ లేకపోయినా డిప్యుటేషన్‌పై వచ్చి ఏళ్ల తరబడి పని చేస్తుండటం విస్మయం కలిగిస్తోంది. రుద్రవరం కేజీబీవీలో మాత్రం ఒకేషనల్ టీచర్ లేక విద్యార్థులు ఇబ్బందిపడుతున్నారు. పోని చాగలమర్రిలో పని చేస్తున్న టీచర్‌నైనా రుద్రవరానికి మార్చారా అంటే అదీ లేదు.

● ప్రిన్సిపాల్ ఫిర్యాదుతో వెలుగులోకి...

తమ కేజీబీవీకి నియమించిన ఒకేషనల్ టీచర్ ఏళ్ల తరబడి డిప్యుటేషన్ రూపంలో మరోచోట పని చేస్తుండటంతో విద్యార్థులకు ఇబ్బందికరంగా మారిందని ప్రిన్సిపాల్ ఇటీవల ఏపీసీకి ఫిర్యాదు చేశారు. సదరు టీచర్ డిప్యుటేషన్ రద్దు చేసి ఇక్కడికి కేటాయించాలని, లేకపోతే మరొకరినైనా నియమించాలని కోరారు. ఇప్పటికైనా అధికారులు ఆ మేరకు చర్యలు తీసుకుంటారో లేదో చూడాలి మరి.

● ఫిర్యాదు వచ్చిన విషయం వాస్తవమే..



కేజీబీవీ ఒకేషనల్ టీచర్ విషయమై ఫిర్యాదు చేసిన విషయం వాస్తవమే. ఈ మేరకు విచారణ చేస్తున్నాం. త్వరలోనే సదరు కేజీబీవీకి టీచర్‌ను కేటాయించి విద్యార్థులకు న్యాయం చేస్తాం. ఇతరత్రా అంశాలపై ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు చర్యలు తీసుకుంటాం.

\- ప్రేమంత్‌కుమార్, ఏపీసీ, సమగ్ర శిక్ష



జనరిక్ ఔషధాల వాడకాన్ని ప్రోత్సహించాలి



మాట్లాడుతున్న ఎంపీ బస్తిపాటి నాగరాజు

కర్నూలు హాస్పిటల్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): జనరిక్ ఔషధాల వాడ కాన్ని ప్రోత్సహించాలని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు పిలుపు నిచ్చారు. శుక్రవారం నగరంలోని బుధవారపేటలో ప్రధాన మంత్రి జన ఔషధి కేంద్రంలో జాతీయ జన ఔషధి దినోత్సవం జరిగింది. కార్యక్రమానికి కర్నూలు ఎంపీ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. జనరిక్ మందుల గురించి ప్రజల్లో అవగాహన పెరగాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఔషధ నియంత్రణ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఏటీవీ రమాదేవి, డీఎంహెచ్‌వో పి.శాంతికళ, సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వర్లు, కర్నూలు అర్బన్, రూరల్ డ్రగ్ ఇన్స్‌పెక్టర్లు హరిహరతేజ, పర్వీన్ సుల్తానా పాల్గొన్నారు.

'గోరుకల్లు' పెండింగ్ పనులు పూర్తి చేయాలి

కల్లూరు, మార్చి 7(ఆంధ్రజ్యోతి): గోరుకల్లు ప్రాజెక్టు పెండింగ్ పనులను పూర్తి చేయాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత అసెంబ్లీలో ప్రభుత్వాన్ని కోరారు. రాయలసీమ వెనకబడిన ప్రాంతం గత వైసీపీ ప్రభుత్వ నిర్వాకం వల్ల ప్రాజెక్టు దయనీయస్థితికి చేరిందని ఆవేదన వ్యక్తం చేశారు. నంద్యాల, కడప జిల్లాల్లో దాదాపు 19వేల ఎకరాలకు సాగు, తాగునీరు అందించే ముఖ్య ఉద్దేశంతో 12.44 టీఎంసీ కెపాసిటీతో ఏర్పాటైందన్నారు. ఈ ప్రాజెక్టు 9శాతం పనులను గత వైసీపీ ప్రభుత్వం పూర్తి చేయలేక పోవడంతో రైతులు అవస్థలు పడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రౌండ్‌వాటర్ డిపార్ట్‌మెంట్ అధికారులు గోరు కల్లు ప్రాజెక్టు పరిశీలనలో లీకేజీలను గుర్తించి రిపోర్టు ఇచ్చారని, దాదాపు 150 ఎకరాల్లో రైతులు వేసుకున్న పంటలు నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. రిజర్వాయర్ రివిట్మెంట్ కుంగిపోయిందని, ఇంజనీర్ల సమాచారంతో ఆ శాఖ ఈసీ, సీడీఓ గోరుకల్లు ప్రాజెక్టు చీఫ్ ఇంజనీరు డ్యామ్‌ను సందర్శించారని వివరించారు.

హంస అసోసియేషన్ గుర్తింపునకు ఏడాది

కర్నూలు హాస్పిటల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఏపీ హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ అండ్ సర్వీస్ అసోసియేషన్ (ఏపీ హంసా)కు ప్రభుత్వం గుర్తించి ఏడాది అయింది. ఈ సందర్భంగా ఏపీ హంసా కర్నూలు సీటీ అధ్యక్షుడు టి.గోవిందు ఆధ్వర్యంలో శుక్రవారం జీజీహెచ్ సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వర్లు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఏపీ హంసా సిటీ సెక్రటరీలు సంపత్ కుమార్, చక్రి, అసోసియేట్ ప్రెసిడెంట్ మద్దూరు వెంకటస్వామి, ఆర్గనైజింగ్ సెక్రటరీ వేణు గోపాల్, కోశాధికారి శివుడు, లీలమ్మ పాల్గొన్నారు.

మహిళలకు ఆస్తి హక్కు కల్పించిన ఎన్టీఆర్

● జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకట శేషాద్రి

కర్నూలు కల్చరల్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): మహిళలకు ఆస్తిలో హక్కు కల్పించిన నాయకుడు మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు అని, ఆ తర్వాత కేంద్ర ప్రభుత్వం కొన్ని మార్పులు చేసి పురుషులతో పాటూ మహిళలకు హక్కు కలిగించారని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకట శేషాద్రి అన్నారు. శుక్రవారం రాత్రి నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో శ్రీనటరాజ నృత్య కళామందిరం, టీజీవీ కళాక్షేత్రం సంయుక్త ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళలకు కళాసౌరభ 'నారీశక్తి పురస్కారాలు' ప్రదానోత్సవం చేశారు. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ఏపీఎస్పీ డీఎస్పీ మహబూబ్‌బాషా, సీఐలు ఎం.ఆదిలక్ష్మి, ఎల్.విజయరెడ్డి తదితరులు ప్రసంగించారు. అనంతరం సీఐలు ఎం.ఆదిలక్ష్మి, విజయరెడ్డి, ఇతర రంగాల్లో రాణిస్తున్న కౌన్సిలింగ్ సైకాలజిస్టు జ్యోతిర్మయి, ప్రొఫెసర్ ఎస్వీ సునీత, జ్ఞానేశ్వరి, వై. మల్లేశ్వరమ్మ, దండే స్వప్నశ్రీ, ఎ.జయలక్ష్మి, డాక్టర్ విద్యా వాసిని, అనితాదేవి, సోమిశెట్టి సరళ, మాధవీలత, సరోజ, నాగమల్లేశ్వరి, డాక్టర్ కె. చంద్రమౌళిని, బి.రాణి లీలావతి, రమ్యాబాయి తదితరులను శాలువ, పూలదండ, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నటరాజ నృత్య కళామందిరం అధ్యక్షుడు ఎస్.కరీముల్లా, కార్యదర్శులు డాక్టర్ బీవీ స్వరూప్‌సిన్హా, కేపీఆర్ శర్మ తదితరులు పాల్గొన్నారు.



సీఐ విజయరెడ్డిని సత్కరిస్తున్న న్యాయమూర్తి లీలా వెంకట శేషాద్రి తదితరులు

ఉపాధ్యాయుడిగా మారిన కలెక్టర్

కర్నూలు ఎడ్యుకేషన్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): కలెక్టర్ రంజిత్ బాషా ఉపాధ్యాయుడిగా మారారు. శుక్రవారం స్థానిక ఎస్‌ఏపీ క్యాంపులోని నగర పాలక ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. అనంతరం కలెక్టర్ ఉపాధ్యాయుడుగా మారి గణితం సులభంగా అర్థమయ్యేలా పదో తరగతి విద్యార్థులు టిప్స్ నేర్పించారు. గణిత శాస్త్రాన్ని అర్థం చేసుకుంటే చాలా సులభమని, పరీక్షలో ప్రశ్నలకు జవాబులు రాయవచ్చునని ఉదాహరణలతో విద్యార్థులకు కలెక్టర్ వివరించారు. స్లోరన్నర్స్ విద్యార్థులకు గణితం సులభంగా అర్థమయ్యేలా బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. వర్చువల్ విధానం ద్వారా పాఠాలను ప్రధానోపాధ్యాయులు వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. పాఠశాల ఆవరణంలో పరిశుభ్రత మెయింటెనెన్స్ చేయాలని, ప్రతి మూడో శనివారం నిర్వహిస్తున్న స్వచ్ఛత దివస్ కార్యక్రమంలో భాగంగా పరిశుభ్రత కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. పాఠశాలలో మినరల్ వాటర్ ప్లాంటును త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వివరించారు. అనంతరం మధ్యాహ్న భోజనం పథకాన్ని ఆయన తనిఖీ చేశారు. అన్నం తయారీకి ఫిల్టర్‌వాటర్‌ను వినియోగించుకోవాలని, గుడ్లను పరిశీలించి సైజు చిన్నగా ఉండడాన్ని గమనించి సరఫరా చేస్తున్న సంబంధిత ఏజెన్సీకి షోకాజ్ నోటీసు ఇవ్వాలని డీఈవోను కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ వెంట హెచ్ఎం వెంకటరెడ్డి, ఉపాధ్యాయులు ఉన్నారు.



పది విద్యార్థులకు సూచనలిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

వైద్య ఆరోగ్య శాఖలో పదోన్నతుల కౌన్సెలింగ్

కర్నూలు హాస్పిటల్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్య శాఖలో రాష్ట్ర వ్యాప్తంగా పని చేస్తున్న ఎంపీహెచ్‌ఈవో, పీహెచ్‌ఎన్ (టీచింగ్)లకు కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లుగా ఈ నెల 11వ తేదీ పదోన్నతుల కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డా.కే పద్మావతి, ఆదేశాలు జారీ చేశారు. ఈ నెల 11న సంబంధిత డీఎంహెచ్‌వో కార్యాలయంలో జూమ్ కౌన్సెలింగ్ ద్వారా ఉదయం 11గంటలకు జరుగుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 56 మందికి పదోన్నతుల కౌన్సెలింగ్ జరగనుండగా.. కర్నూలు జిల్లాలో ఆరుగురు, నంద్యాల జిల్లాలో ఏడుగురు ఉన్నారు. కర్నూలు జిల్లాల నుంచి కే వెంకటలక్ష్మి, పి.స్వర్ణలత, కే.రాణి ఎస్తేర్, టీ లీలావతి (ఆర్‌టీసీ ఫీమేల్), పి.రామకృష్ణయ్య (కోసిగి పీహెచ్‌సీ), ఎ.రాజశేఖర్, (పొలకల్ పీహెచ్‌సీ), నంద్యాల జిల్లా నుంచి ఎస్వీ మురళీకృష్ణ (డీఎంహెచ్‌వో కార్యాలయం, నంద్యాల), వి.లక్ష్మీనారాయణ (పేరుసోముల పీహెచ్‌సీ) బీసీ హుశేన్ రెడ్డి (గాజులపల్లె పీహెచ్‌సీ) ఎస్ఎండీ సైఫుల్లా (కొత్తబురుజు పీహెచ్‌సీ), ఎన్.వెంకటేశ్వర్లు (టంగుటూరు పీహెచ్‌సీ), బి.చంద్రశేఖర్ (ఎర్రమఠం పీహెచ్‌సీ) పదోన్నతుల జాబితాలో ఉన్నారు.

వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలి

కర్నూలు ఎడ్యుకేషన్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): పెద్దపాడు బీసీ బాలుర హాస్టల్ వార్డెన్ మహాలక్ష్మిపై చర్యలు తీసుకోవాలని డీబీసీడబ్ల్యూవో వెంకటేశ్వర్లుకు ఎస్ఎఫ్ఐ నాయకులు శుక్రవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వార్డెన్ విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించడం లేదన్నారు. ఉడికీ ఉడకని అన్నం, నీళ్ల చారు, కుళ్లిన పండ్లు, గుడ్లు ఇస్తుండటంతో విద్యార్థులు అనారోగ్యాలకు గురవుతున్నారని వివరించారు. డీబీసీడబ్ల్యూవోకు వినతిపత్రం అందజేసిన వారిలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రంగప్ప, అబ్దుల్లా సాయి, అమర్, మల్లేష్, ఖాజా ఉన్నారు.

పొగాకు రైతులను ఆదుకోండి

ఓర్వకల్లు, మార్చి 7(ఆంధ్రజ్యోతి): పొగాకు రైతులను ఆయా కంపెనీలు ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి కోరారు. శుక్రవారం ఓర్వకల్లులోని పొగాకు కొనుగోలు చేస్తున్న ఐటీసీ గోడౌన్‌ను సందర్శించారు. అనంతరం రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. టీడీపీ ప్రభుత్వం రైతులను ఆదుకోవడంలో ఘోరంగా విఫలమైందన్నారు. సాగు చేసిన పొగాకు పంటను ఆయా కంపెనీలు కొనుగోలు చేయాలన్నారు. అనంతరం గుట్టపాడు గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు లక్ష్మీకాంతరెడ్డి అనారోగ్యంతో బాధపడు తుండటంతో ఆయన్ను పరామర్శించారు. కాటసాని వెంట మాజీ కర్నూలు యార్డు చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, వైసీపీ జిల్లా ఉపాధ్యక్షులు వెంగన్న, జడ్పీటీసీ రంగనాథగౌడు ఉన్నారు.

నాటు సారా నిర్మూలనకు సహకరించాలి

కర్నూలు అర్బన్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): నాటు సారా నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ పి.శ్రీదేవి అన్నారు. శుక్రవారం నగరంలోని బంగారుపేటలో నవోదయం 2.0 భాగంగా కాలనీ వాసులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కాలనీలో అసిస్టెంట్ కమిషనర్ వి.హనుమంతరావు, సూపరింటెండెంట్ సుధీర్ బాబు, ఏఈఎస్ రాజశేఖర్ గౌడ్, సీఐలు రాజేంద్రప్రసాద్, చంద్రహాస్‌లు కాలనీ వాసులతో కలిసి ర్యాలీ నిర్వహించారు.

ఉపాధి పనులు కల్పిస్తాం: ఎంపీడీవో

ఓర్వకల్లు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): జాబ్‌కార్డు ఉన్న ప్రతి కూలీకి ఉపాధి పనులు కల్పిస్తామని ఎంపీడీవో శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం మండలం లోని ఉయ్యాలవాడ గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన తనిఖీ చేసి మస్టర్లను పరిశీలించారు. అనంతరం హుశేనాపురం గ్రామంలో సచివాలయ సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీవో కుమారసాయినాథ్, సచివాలయ అధికారులు పాల్గొన్నారు.

గోదా గోకుల క్షేత్రంలో నేడు అష్టోత్తర శత కలశ పూజలు

కర్నూలు కల్చరల్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): నగర శివారు మామిదాలపాడులో వెలసిన గోదారంగనాథస్వామి దేవస్థానం(గోదా గోకుల క్షేత్రం)లో ఆలయ ద్వితీయ బ్రహ్మోత్సవాలు నిత్యం వైభవంగా కొనసాగుతున్నాయి. కాగా ఈ ఉత్సవాల్లో భాగంగా ఏడో రోజు శనివారం ఆలయంలో అష్టోత్తర శత కలశ పూజలు నిర్వహించనున్నారు. సాయంత్రం 4 గంటల నుంచి అష్టోత్తర శత కలశ ఉత్సవాంత స్నపనం (కలశపూజ) వైభవంగా నిర్వహించనున్నారు. 108 రజత కలశాలతో స్వామివారికి తిరుమంజనం కార్యక్రమాన్ని చేపడతారు. ఈ వేడుకలు త్రిదండి అష్టాక్షరీ సంపత్కుమార రామానుజ జీయర్ స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో, ఆలయ అర్చక స్వాములు రమేష్ భట్టార్, కిరణ్ భట్టార్, లక్ష్మీనారాయణాచార్యులు, మహేషాచార్యులు శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు. కాగా శుక్రవారం స్వామివారికి సింహవాహన సేవ నిర్వహించారు. ఈ వేడుకలో ఆలయ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షులు మారం నాగరాజ గుప్త, మేనేజింగ్ ట్రస్టీ పల్లెర్ల నాగరాజు, బ్రహ్మోత్సవ నిర్వహణ కమిటీ కార్యవర్గ సభ్యులు ఇటిక్యాల పుల్లయ్య, వేముల జనార్ధన్, లింగం క్రిష్ణయ్య శెట్టి, వేముల రవిప్రకాశ్, కలికి లక్ష్మీనారాయణ, మాకం శ్రీనివాస్, భీమిశెట్టి నాగరాజు, పాలాది వెంకట సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

కేవీ సుబ్బారెడ్డిలో జాతీయ స్థాయి యువజనోత్సవం



మాట్లాడుతున్న కేవీ సుబ్బారెడ్డి

కర్నూలు ఎడ్యుకేషన్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): కేవీ సుబ్బారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయ స్థాయి యువజనోత్సవం శుక్రవారం జరిగింది. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడా దక్షిణాది రాష్ట్రల విద్యార్థులు రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో జేఎన్‌టీయూ డైరెక్టర్ దుర్గాప్రసాద్, ఐఐఐటీడీఎం సత్యబాబు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ కేవీ సుబ్బారెడ్డి మాట్లాడారు. కరస్పాండెంట్ విజయలక్ష్మి, ప్రిన్సిపాల్ కన్నాకుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

రవీంద్రలో ఇంగ్లీషు కార్నివాల్

కర్నూలు ఎడ్యుకేషన్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): స్థానిక మాధవనగర్‌లోని రవీంద్ర ఇంగ్లీషు మీడియం పాఠశాల, రెవెన్యూ కాలనీలో రవీంద్ర టాలెంట్ పాఠశాలలో షేక్స్‌పియర్ జయంతి సందర్భంగా శుక్రవారం ఇంగ్లీష్ కార్నివాల్ ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ప్రొఫెసర్ సునీత రోజ్, కరస్పాండెంట్ పీబీవీ సుబ్బయ్య ముఖ్యఅతిథులుగా హాజరై ప్రసంగించారు. ప్రిన్సిపాల్స్, కోఆర్డినేటర్స్ ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బడ్జెట్ డొల్లతనాన్ని బయటపెట్టిన జగన్: ఎమ్మెల్యే

కల్లూరు, మార్చి 7(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లోని డొల్లతనాన్ని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాక్ష్యాధారాలతో సహా బయటపెట్టారని నంద్యాల జిల్లా వైసీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం తన స్వగృహంలో నిర్వహించిన సమావేశంలో కాటసాని మాట్లాడుతూ రాజకీయ నాయకుడంటే పంచ్ డైలాగులతో ప్రజలను మోసం చేయడం కాదని అన్నారు. మాజీ సీఎం జగన్ ఆధారాలతో సహా మాట్లాడిన అంశాలకు సమాధానం ఇవ్వకుండా మంత్రులు లోకేష్, నాదెండ్ల దుర్భాషలాడటం సరైంది కాదన్నారు.

నిరసనలను జయప్రదం చేయండి: సీపీఐ

కర్నూలు న్యూసిటీ, మార్చి 7(ఆంధ్రజ్యోతి): బడ్జెట్‌లో జిల్లాకు తీరని అన్యాయం జరిగిందని, ఈనెల 10 రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ జిల్లా వ్యాప్తంగా నిరసనలు జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం సీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా కార్యవర్గసభ్యుడు కె.జగన్నాథం, నాయకులు రామక్రిష్ణారెడ్డి, మహేష్, శ్రీనివాసులు, సోమన్న పాల్గొన్నారు.

కాంట్రాక్టు స్టాఫ్ నర్సులను రెగ్యులర్ చేయాలి

కర్నూలు హాస్పిటల్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టు స్టాఫ్ నర్సులను రెగ్యులర్ చేయాలని ఏపీ గవర్నమెంటు నర్సెస్ అసోసియేషన్ కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజుకు వినతిపత్రం సమర్పించింది. కర్నూలు జీజీహెచ్ నర్సెస్ అసోసియేషన్ భవనానికి మరమ్మతులు చేయాలని అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లీలావతి, బంగారి ఎంపీని కోరారు. అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జి.శాంతిభవాని, ఎన్.లక్ష్మీనరసమ్మ పాల్గొన్నారు.

ఆలయ భూములను పరిరక్షించాలి

సి.బెళగల్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ఆలయ భూములను పరిరక్షించాలని కోడుమూరు బీజేపీ సీనియర్ నాయకుడు గోపాల్ అన్నారు. శుక్రవారం సి.బెళగల్‌లో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ గూడూరు, కోడుమూరు, కర్నూలు మండలాల్లో ఆలయ భూములను కొందరు కబ్జా చేసి విక్రయిస్తున్నారని ఆరోపించారు. ఈసమావేశంలో బీజేపీ నాయకులు ఉశేని, దేవన్న, రాముడు, లింగన్న, వెంకటేశ్వర్లు, దస్తగిరి పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాలు మెరుగు పరచండి

కర్నూలు అర్బన్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లాలో విద్యాప్రమాణాలు మెరుగుపరచాలని గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ ఆదేశించారు. శుక్రవారం అమరావతిలోని రాజ్‌భవన్‌లో ఆర్‌యూ ఉపకులపతి వి.వెంకట బసవరావు గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలలో ఉన్నత విద్యను బలోపేతానికి తమ సహకారం ఉంటుందని గవర్నర్ తెలిపినట్లు వీసీ చెప్పారు.

నగరాభివృద్ధికి తోడ్పాటు అందించాలి

కర్నూలు కల్చరల్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): కర్నూలు నగరాభివృద్ధికి ప్రజలు తోడ్పాటు అందించాలని నగరపాలక అదనపు కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ అన్నారు. శుక్రవారం ఆయన నగర శివారు పెద్దపాడు సమీపంలోని ఆకాశవాణి కర్నూలు కేంద్రంలో నగర పాలక అభివృద్ధి, ఇతర అంశాలపై మాట్లాడారు.

ఉపాధి పనుల పరిశీలన

కల్లూరు, మార్చి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉల్లిందకొండ గ్రామంలో ఉపాధి హామీ పనులను ఏపీ వ్యవసాయ కార్మికసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు శుక్రవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీలకు 9 వారాలైనా వేతనాలు ఇవ్వడం లేదన్నారు.



ఆనందమయ జీవితం

కొడుకులను ప్రయోజకుల్ని చేసిన ఆనందమ్మ



కొడుకులతో ఈడిగ ఆనందమ్మ

కోడుమూరు రూరల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): కష్టాలు వెన్నాడినా ఆ అమ్మ కుంగిపో లేదు. రెక్కల కష్టంతో కొడుకులను ప్రయోజకులుగా తీర్చిదిద్దింది. కొడుకుల సంరక్షణలో ఇప్పుడామె ఆనందంగా ఉన్నారు. మండలంలోని ప్యాలకుర్తి గ్రామానికి చెందిన ఈడిగ బుచ్చన్నగౌడ్, ఆనందమ్మ దంపతులకు సెంటు పొలం లేదు. బాడుగ ఇంట్లో ఉంటూ జీవనం సాగించేవారు. బుచ్చన్నగౌడ్ సంతల్లో ఎండు మిరపకాయలు విక్రయించేవాడు. ఆనందమ్మ ఇరుగు పొరుగుతో కలిసి కూలి పనులకు వెళ్లేది. ఈ దంపతులకు ముగ్గురు కుమారులు. ఆ దంపతులు తమకొచ్చే కొద్దిపాటి సంపాదనతోనే జీవనం గడుపుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల్ని చదివించసాగారు. అసలే ఒడిదుడుకుల మధ్య సాగుతున్న కుటుంబంలో బుచ్చన్నగౌడ్ 2011లో గుండెపోటుతో మృతి చెందడం తీవ్ర విషాదం నింపింది.

● ఏటికి ఎదురీత

భర్తను కోల్పోయిన ఆనందమ్మ చుట్టూ చీకట్లు అలుముకున్నాయి. ఆ సమయంలో పెద్దకొడుకు హరిక్రిష్ణగౌడ్ బీటెక్ రెండో సంవత్సరం, రుద్రగౌడ్ పది, ఈశ్వర్‌గౌడ్ ఎనిమిదో తరగతి చదువుతున్నారు. ఒక వైపు పిల్లల చదువు, మరోవైపు బతుకు బండిలాగే బాధ్యత ఆనందమ్మపై పడింది. పిల్లల భవిష్యత్‌ను తీర్చిదిద్దడానికి ఎంతో శ్రమించింది. రోజూ కూలి పనులకెళుతూ సెలవు రోజుల్లో పిల్లల్ని కూడా వెంట తీసుకెళ్లేది. ఎంతకష్టం ఎదురైనా పిల్లలకు చదువు విలువ నూరిపోసింది. ఆ విధంగా పెద్దకొడుకు హరిక్రిష్ణగౌడ్ ఎంటెక్ పూర్తి చేసి ముంబాయిలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం సాధించాడు. రెండో కుమారుడు రుద్రగౌడ్ బీటెక్ పూర్తి చేసి సచివాలయంలో సర్వేయర్ ఉద్యోగం సాధించాడు. మూడో అబ్బాయి ఈశ్వరగౌడ్ ఎమ్మెస్సీ, బీఎడ్ పూర్తి చేశాడు. మొన్నటి వరకు బైజూస్‌లో పని చేసి ప్రస్తుతం డీఎస్సీకి ప్రిపరేషన్‌లో ఉన్నాడు. ఒకప్పుడు సొంత ఇల్లు కూడా లేని ఆనందమ్మ ఇపుడు కొడుకుల కష్టార్జితంతో కట్టిన సొంతింట్లో ఉన్నారు. పెద్దకుమారుడికి పెళ్లి జరిపించారు.

మహిళలు బహుముఖ ప్రజ్ఞావంతులు: జేసీ




మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ నవ్య

కర్నూలు కలెక్టరేట్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): మహిళలు బహుముఖ ప్రజ్ఞావంతులని, అందుకే వారు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని జాయింట్ కలెక్టర్ బి.నవ్య అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని సునయన ఆడిటోరియంలో ఏపీజేఏసీ అమరావతి, మానవతా మహిళా విభాగం, ఏపీ రెవెన్యూ అసోసియేషన్, ఉమెన్ వెల్ఫేర్ అసోసియేషన్లు నిర్వహించిన వేడుకలకు ముఖ్యఅతిథిగా పాల్గొన్న జాయింట్ కలెక్టర్ నవ్య మాట్లాడుతూ మహిళలు ఒత్తిడికి దూరంగా ఉండాలన్నారు. అనంతరం డీఆర్వో వెంకటనారాయణమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ప్రసన్నలక్ష్మి మాట్లాడారు. అనంతరం వివిధ క్రీడా పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మైనార్టీ సంక్షేమ అధికారి పర్వీన్, ఏపీజేఏసీ మహిళా విభాగం చైర్మన్ సాహేరాబాను, తహసీల్దార్ నాగమణి, యానీ ప్రతాప్, శివపార్వతి, సరస్వతమ్మ పాల్గొన్నారు.

కర్నూలు అగ్రికల్చర్: మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని జేసీ నవ్య అన్నారు. జిల్లా సహకార కేంద్ర బ్యాంకు సమావేశ భవనంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు అధికారులు, సిబ్బంది ఆమెను సన్మానించారు. కార్యక్రమంలో సీఈవో విజయకుమార్, సహకార శాఖ అధికారి రామాంజనేయులు, డీజీఎంలు ఉమామహేశ్వరి, డీపీడీఎం వహీదా సుల్తాన్ పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి నాబార్డు కృషి: మహిళల ఆర్థికాభివృద్ధికి నాబార్డు కృషి చేస్తుందని ఏజీఎం సుబ్బారెడ్డి అన్నారు. శుక్రవారం నగరంలోని బీ.క్యాంపులో బాలికల ఉన్నత పాఠశాలలో నాబార్డు ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఏపీసీవోబీ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ షాహీదా సుల్తానా, ప్రధానోపాధ్యాయురాలు ప్రశాంతి, ఉల్చాల ఏపీజీబీ మేనేజర్ చంద్రాణి, ఎఫ్ఎల్‌సీ కోఆర్డినేటర్ రామలక్ష్మయ్య, కృష్ణానగర్ డీసీసీబీ బ్యాంకు మేనేజర్ రమాదేవి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నాబార్డు ఏజీఎం సుబ్బారెడ్డి 500 మంది విద్యార్థులకు బహుమతుల ప్రదానం చేశారు.



మాట్లాడుతున్న సుబ్బారెడ్డి

కర్నూలు కల్చరల్: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని 17 వార్డు కార్పొరేటర్ క్రైప పద్మలతారెడ్డి అన్నారు. శుక్రవారం నగరంలో జిల్లా కేంద్ర గ్రంథాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ముందుగా వారు మాజీ ప్రధాని, ఇందిరాగాంధీ, మదర్ థెరిస్సా సరోజినీ నాయుడు, ఝాన్సీలక్ష్మీబాయి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. నిఖిలేష్ ఎడ్యుకేషన్ అకాడమి చైర్మన్ మద్దిలేటి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు కేజీ గంగాధరరెడ్డి, డిప్యూటీ లైబ్రేరియన్ వి.పెద్దక్క, గోవిందరెడ్డి పాల్గొన్నారు.

మహిళలు స్ఫూర్తిదాయకంగా ఉండాలి: డీఆర్వో

కర్నూలు అర్బన్: మహిళలు స్ఫూర్తిదాయకంగా నిలవాలని కర్నూలు డీఆర్వో సి.వెంకట నారాయణమ్మ అన్నారు. శుక్రవారం నగరంలోని డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీలో ప్రపంచ మహిళా దినోత్సవం పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మహబూబ్‌బాషా, మహిళా సాధికారిత సెల్ సభ్యులు జహనారా, నిర్మల, విద్యార్థులు పాల్గొన్నారు.

● క్లస్టర్ యూనివర్శిటీ పరిధిలోని సిల్వర్ జూబ్లీ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా న్యాయవాది సి.సరళాదేవి హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ కట్టా వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపాల్ ప్రసాదరెడ్డి, ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

మల్లెపల్లెలో పశువులకు టీకాలు


దూడకు టీకా వేస్తున్న దృశ్యం

వెల్దుర్తి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): మండలంలో మల్లెపల్లె గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గురువారం ఆవులు, గేదేలు, ఎద్దులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేశారు. ఈ సందర్భంగా డీడీ దుర్గా ప్రసన్నబాబు మాట్లాడుతూ జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా అన్ని గ్రామాల్లో నాలుగు నెలలు పైబడిన ఆవులు, గేదేలకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు, 4-8 నెలల పెయ్య దూడలకు బ్రూసెలోసిస్ టీకాలు ఉచితంగా వేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పశువైద్యాధికారిణి శాంతలత, సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి


మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

మద్దికెర, మార్చి 7 (ఆంధ్ర జ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని మాజీ జడ్పీటీసీ జమేదార్ రాజన్న యాదవ్, జిల్లా టీడీపీ సాధి కారత కన్వీనర్ ఎన్. లక్ష్మినారాయణ అన్నారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ మహిళా దినోత్సవం సందర్భంగా కూటమి ప్రభుత్వం అంగన్‌వాడీల కార్యకర్తలు, ఆయాలకు పదవీ విరమణ వయస్సు 62 సంవత్సరాలకు పెంచిందన్నారు. ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు పత్తికొండ ప్రాంతాన్ని అభివృద్ధి పథంలో నడుపుతూ జిల్లాలోనే పత్తికొండను ఆదర్శంగా నిలుపుతున్నాడన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌పై మాట్లాడే అర్హత జగన్‌కు లేదన్నారు. డిప్యూటీ సీఎం పవన్‌పై జగన్ చేసిన అనుచిత వ్యాఖ్యలు సబబు కాదన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు మీసేవా భీమరాజు, వెంకట్రాయుడు, గొడుగు సతీష్ కుమార్ తదితరులు ఉన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

మద్దికెర, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చేయడం చట్టరిత్యా నేరమని ప్రభుత్వ వైద్యాధికారి శ్రీలక్ష్మి, సీహెచ్‌వో నిరంజన్‌బాబు, హెల్త్ ఎడ్యుకేటర్ అక్బర్ బాషా అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో ఆశా కార్యకర్తల సమావేశం జరిగింది. ముందుగా బాల్య వివాహాలపై పోస్టర్‌ను విడుదల చేశారు. మండలంలో అన్ని గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నామని అన్నారు.

రీసర్వే వేగవంతం చేయాలి

మద్దికెర, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెరవలి గ్రామంలో రీసర్వే వేగవంతం చేయాలని తహసీల్దార్ హుశేన్‌సాహెబ్, డిప్యూటీ తహసీల్దార్ శ్రీదేవి అన్నారు. శుక్రవారం పెరవలి గ్రామంలో రీసర్వేను పరిశీలించారు. వారు మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమైయ్యేలోపు వంద శాతం సర్వే పూర్తి చేయాలని తెలిపారు. ప్రతిరోజు కనీసం ఒక్కొక్క టీం 20 ఎకరాలకు తగ్గకుండా సర్వే చేయాలన్నారు. రీసర్వే అయిపోయిన తర్వాత రైతుల సూచనల మేరకే ఆన్‌లైన్ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో వీఆర్వోలు రంగస్వామి, రషీదు, రామాంజనేయులు తదితరులు ఉన్నారు.

రేపు కప్పట్రాళ్లలో వైద్య శిబిరం

దేవనకొండ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : కప్పట్రాళ్ల ఎంపీపీ పాఠశాల ఆవరణలో కర్నూలు సత్యసాయి సేవా సంస్థ అధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఇగల్ ఐజీ ఆకె రవికృష్ణ ప్రోద్బలంతో సత్యసాయి సేవా సంస్థ వారు నిర్వహిస్తున్న వైద్యశిబిరం గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

11న గుంటూరులో ధర్నా

పత్తికొండ టౌన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరంలో ఈ నెల 11న గొర్రెలు, మేకల అబివృద్ధి సహకార ఫెడరేషన్ కార్యాలయం వద్ద జరిగే ధర్నా కార్యక్రమానికి పెద్ద ఎత్తున గొర్రెలు, మేకల పెంపకందారులు తరలిరావాలని చేతివృత్తి దారుల సమైఖ్య జిల్లా కార్యదర్శి కారన్న పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన పత్తికొండలో మాట్లాడుతూ వ్యవసాయం తర్వాత గొర్రెల, మేకల పెంపకం కీలక పాత్ర పోషిస్తుందని, ఈ రాష్ట్రంలో లక్షలాది మంది కుటుంబాలు గొర్రెలు, మేకల పెంపకం సంపాదనపై జీవనోపాధి పొందుతున్నారని అన్నారు. గుంటూరులో జరిగే ధర్నాకు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

గ్రామ అభివృద్ధికి సహకారం అందించాలి

ఆలూరు రూరల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : గ్రామ అభివృద్ధికి గ్రామస్తులంతా సహకారం అందించాలని పెద్దహోతూరు గ్రామ సర్పంచ్ మునెమ్మ, టీడీపీ నాయకుడు జొరహాపురం వీరేశ్ అన్నారు. శుక్రవారం పెద్దహోతూరు గ్రామంలో రూ.25 లక్షలతో సీసీ రోడ్డు డ్రైనేజీ కాల్వ నిర్మాణం పనులు చేపట్టారు. పరిష్కారానికి సర్పంచి ఆధ్వర్యంలో కొత్త బోరును ప్రారంభించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రమేష్, ఎంపీటీసీ చిన్న యాదవ్, కెకెడి పాల్గొన్నారు.

చలివేంద్రాల ఏర్పాటుకు
దాతల సహకారం అవసరం

ఆదోని అగ్రికల్చర్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : వేసవి ఎండలను దృష్టిలో ఉంచుకొని చలివేంద్రాల ఏర్పాటుకు దాతల సహకారం ఎంతో అవసరమని ప్రముఖ పారిశ్రామికవేత్త బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు విట్టా రమేష్ అన్నారు. శుక్రవారం ఆర్ట్స్ కళాశాల రహదారిలో విశ్వ నారాయణ జూనియర్ ఒకేషనల్ కళాశాల ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పట్టణానికి వివిధ పనుల నిమిత్తం వేలాది మంది గ్రామీణ ప్రాంత వాసులు వస్తున్నారన్నారు. రోజురోజుకి ఎండల తీవ్రత పెరుగుతుందని వారి దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేయడం హర్షించదగ్గ విషయం అన్నారు. ప్రతి ఒక్కరు ముందుకు వచ్చి చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ కరెస్పాండెంట్ మల్లికార్జున, అధ్యాపకులు పాల్గొన్నారు.

మహిళలు దేశానికి వెలుగులు

● నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం ● ముందస్తుగా పలు ప్రాంతాల్లో సమావేశాలు



పురుషులతో సమానంగా మహిళలు ప్రతి రంగంలో రాణిస్తున్నారు. రాజకీయాలు, విద్య, ఉద్యోగాలు, వ్యాపారాల్లో పురుషులకు దీటుగా పోటీ పడుతున్నారు. వంటింటికే పరిమితం కాకుండా వారికి నచ్చిన రంగంలో పని చేస్తూ కుటుంబాలకు ఆసరాగా ఉంటున్నారు. ఒకప్పుడు ఆడపిల్లను బయటకు పంపించాలంటే తల్లిదండ్రులు ఆందోళన చెందేవారు. ఇప్పుడు పరిస్థితులు మారాయి. శనివారం అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా జిల్లాలో పలుప్రాంతాల్లో ముందస్తు వేడుకలు నిర్వహించారు. ప్రత్యేక సమావేశాలు నిర్వహించి మహిళల అభివృద్ధిపై చర్చించారు.

ప్రభుత్వం మరింత కృషి చేయాలి



ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మహిళల అభివృద్ధి కోసం కొన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాడని, మరింత సంక్షేమ పథకాలు అందజేస్తే మహిళలు ఆర్థికంగా బలోపేతం చెందుతారు. మహిళల హక్కుల కోసం ప్రత్యేక చట్టాన్ని అమలు చేయాలి. మహిళలపై దాడులు జరగకుండా ప్రత్యేక చొరవ తీసుకోవాలి.

- పద్మావతి, మద్దికెర, మాజీ ఎంపీపీ

మహిళలకు రుణాలు ఇవ్వాలి



మహిళలకు రుణాలు ఇచ్చి జీవనోపాధి కల్పించాలి. మహిళలకు రుణాలు ఇవ్వడంతో ఆర్థికంగా బలోపేతమై తమ కాళ్లపై వారే నిలబడుతారు. ప్రభుత్వం అంగన్‌వాడీ ఆయాలకు, టీచర్లకు 62 ఏళ్లకు పెంచడం చూస్తుంటే సీఎం చంద్రబాబు నాయుడుకు మహిళలపై మంచి చిత్తశుద్ధి ఉంది.

- విజయలక్ష్మి, కొత్తపల్లి, ఎంపీటీసీ

ఆదోని అగ్రికల్చర్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : మహిళలు దేశానికి వెలుగు అని డీఎస్పీ మర్రిపాటి హేమలత అన్నారు. శుక్రవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జ్యోతిర్మయి డిగ్రీ కళాశాల కాన్ఫరెన్స్ హాల్లో అమ్మాయిల విద్య-సమాజాభివృద్ధి అంశంపై సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన డీఎస్పీ హేమలత మాట్లాడుతూ విద్యార్థినులు చదువుపై దృష్టి పెడితే వారి కుటుంబంతో పాటు సమాజాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. సోషల్ మీడియా మోజులో పడి తమ జీవితాలను నాశనం చేసుకోవద్దు అన్నారు. చదువు విలువ తెలుసుకొని తల్లిదండ్రుల కలలను సాకారం చేసుకోవాలని సూచించారు. దేశం అభివృద్ధి చెందాలంటే మహిళల పాత్ర కీలకమన్నారు. ఉన్నత ఆశయం కలిగి అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలని సూచించారు. అనంతరం కళాశాల కరస్పాండెంట్ మురళి బాబు మాట్లాడుతూ యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షురాలు జీవిత మాట్లాడుతూ మహిళ హక్కులపై విస్తృతంగా ప్రచారం జరగాలన్నారు. మహిళల విద్యాకోసం కృషి చేసిన సావిత్రిబాయి పూలే కృషి ఎనలేనిది అన్నారు. వివక్ష లేని సమాజాన్ని నిర్మించుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు ప్రిన్సిపల్ సాయి నాథ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ హేమలత

మహిళలు రాణించాలి

ఆదోని అగ్రికల్చర్: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఆయుర్వేదిక్ నిపుణురాలు డాక్టర్ కీర్తి ప్రియ పేర్కొన్నారు. శుక్రవారం మిల్టన్ గ్రామర్ ఉన్నత పాఠశాలలో ముందస్తు మహిళా దినోత్సవ వేడుకలను జరుపుకున్నారు. ముఖ్య అతిథులుగా హాజరైన ఆమె మాట్లాడుతూ మహిళలు వంటింటికే పరిమితం కాకుండా మహిళ సాధికారత దిశగా కృషి చేయాలని సూచించారు. ఆడపిల్లలను చదివించాలని సూచించారు. అనంతరం మహిళా ఉపాధ్యాయులు ఆటల పోటీలు నిర్వహించి వారికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ రమేష్ బాబు, ప్రిన్సిపాల్ నాగరాజు ఉపాధ్యాయులు సుశీల, విజయలక్ష్మి, లావణ్య, వెంకటేష్ పాల్గొన్నారు.


మదర్ థెరిసా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న డాక్టర్ కీర్తి ప్రియ

హక్కుల కోసం ఉద్యమించాలి

పత్తికొండ టౌన్: సమాజంలో అనగబడుదొక్కుతున్న మహిళలు తమ హక్కుల సాధన కోసం సంఘటితంగా పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఎం మండల కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డి, సీఐటీయూ నాయకులు గోపాల్, దస్తగిరి మహిళలకు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక ఈశ్వర్‌రెడ్డి భవన్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సభను సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి మహిళా సంఘం అధ్యక్షురాలు కాంతమ్మ అధ్యక్షత వహించారు. వారు మాట్లాడుతూ స్వాతంత్రం తెప్పించి నేటికి ఏళ్ల గడుస్తున్నా మహిళలకు స్వేచ్ఛ సమానత్వం, రక్షణ కరువైందన్నారు. పురుషులతో సమానంగా స్త్రీలు కూడా గౌరవించబడిన రోజే సమాజాభివృద్ధి చెందుతుందన్నారు. కూటమి ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో మహిళా సంఘాల నాయకులు లక్ష్మి, హసీనా, గౌరి, రామలక్ష్మి, సోమేశ్వరి, చిట్టెమ్మ పాల్గొన్నారు.

మద్దికెర: శనివారం జరిగే మహిళా దినోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని మండల విద్యాధికారి రంగస్వామి, శ్రీవిద్యాసాయి కళాశాల ఎండీ యజ్ఞం వెంకటమాధవ, ప్రిన్సిపాల్ బాల సునీత అన్నారు. శుక్రవారం స్థానిక విద్యాసాయి కళాశాలలో వారు మాట్లాడుతూ ఆడ పిల్లలు మహిళలుపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు ముందుకు రావాలని సూచించారు.

ఆదోని టౌన్ : మహిళలు అన్ని రంగాలలో రాణించాలని లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ ప్రసాద్ రావు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని దృష్టిలో పెట్టుకొని లయన్స్ క్లబ్, ఆవోపా, వామ్ సంస్థలు సయుక్తంగా స్థానిక ప్రభుత్వ బాలికల పాఠశాలలో బాలికలకు ముందస్తుగా ఏర్పాటు చేసిన వివిధ పోటీలలోని విజేతలకు శుక్రవారం బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఆవోపా కార్యదర్శి వంకదారు శ్రీనాథ్ గుప్తా, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ధర్మారెడ్డి, వన్నప్ప రాజు, ఓం ప్రకాష్, ఆవోపా తరపున వెంకటేశ్వరులు, ప్రతాప్ ఈరన్న శెట్టి ఉపాధ్యాయులు ఇంద్రావతి, జయప్రద, మంజుల నాగిరెడ్డి పాల్గొన్నారు.

గిరిజనం కోసం కళ్యాణమ్మ

పత్తికొండ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మూతపడే దశలో ఉన్న ఆ గిరిజన పాఠశాలను బదిలీపై వచ్చిన ఉపాధ్యాయురాలు కళ్యాణమ్మ రూపురేఖలు మార్చివేశారు. పత్తికొండ మండలం జెఎం తండాలోని పాఠశాలలో ముగ్గురు విద్యార్థులు మాత్రమే ఉండేవారు. 2017లో కళ్యాణమ్మ ఆ పాఠశాలలకు ఉపాధ్యాయురాలిగా వెళ్లారు. ఆ పాఠశాల రూపు రేఖలు మార్చేశారు. ల్యాప్‌టాప్ ద్వారా పాఠ్యాంశాలు బోధించడంతో పాటు నవోదయ, సైనిక్, గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్షలకు ప్రత్యేకంగా బోధించారు. ప్రస్తుతం 43 మంది విద్యార్థులు ఆ పాఠశాలలో చదువుకుంటున్నారు. ఆమెకు ప్రభుత్వం 2022లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డును ఇచ్చి గౌరవించింది.


విద్యార్థులకు ల్యాప్‌టాప్ ద్వారా పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయురాలు


పత్తికొండలో మాట్లాడుతున్న వెంకటేశ్వరరెడ్డి

మహిళలతోనే వెలుగు



మహిళలతోనే దేశానికి వెలుగు. ప్రతి ఇంట్లో ఒక మహిళ ఉంటుంది. తండ్రికి కూతురు, భర్తకు భార్య, అన్నకు చెల్లి ఉంటుంది. దేవుడు ప్రతి చోట ఉండలేరు కాబట్టి అమ్మను సృష్టించారు. అమ్మ ఆ కుటుంబానికి అన్నీ తీర్చగల శక్తి ఉంటుంది. అవని నుంచి అంతరిక్షం వరకు మహిళలు ఎదిగారు.ప్రతి ఒక్కరు మహిళలను గౌరవించాలి.

- కళ్యాణి, తెలుగు ఉపాధ్యాయురాలు

సమాజంలో మహిళ పాత్ర కీలకం



ప్రస్తుతం సమాజంలో మహిళా పాత్ర కీలకం. కుటుంబం ఎదుగుదల నిలబడాలన్న అమ్మగా అక్కగా భార్యగా చెల్లిగా ప్రధానమైన పాత్ర పోషిస్తుంది. కుటుంబ అభివృద్ధితో పాటు పిల్లల ఎదుగుదలకు ఎంతో కృషి చేస్తుంది. మహిళా ఓర్పుతోనే సమాజం అభివృద్ధి చెందుతుంది. నేడు దేశంలో రాష్ట్రపతిగా ద్రౌపతి ముర్ము కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ ఢిల్లీ ముఖ్యమంత్రి తో పాటు పలువురు మహిళలు అన్ని రంగాలలో రాణించడం అభినందనీయం. అయితే ప్రస్తుతం బాలికలు ఒంటరిగా వెళ్లలేని పరిస్థితిలో ఉన్నారు. వారికి భద్రత కల్పించాల్సిన అవసరం ప్రతి ఒక్కరికి ఉంది.

- ఎస్ పరిమళ ఎన్‌సీసీ ఆఫీసర్, నెహ్రూ ఉన్నత పాఠశాల ఆదోని

పురపాలక స్థలాలను పరిరక్షించాలి


కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న యువ మోర్చా నాయకులు

ఆదోని టౌన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : పట్టణ పరిధిలోని పురపాలక స్థలాలు కబ్జాలకు గురికాకుండా పరిరక్షించాలని బీజేపీ యువ మోర్చా ఆధ్వర్యంలో శుక్రవారం మునిసిపల్ కమిషనర్ కృష్ణకు వినతిపత్రం ఇచ్చారు. యువ మోర్చా రాష్ట్ర మాజీ కార్యదర్శి శ్రీనివాస ఆచారి మాట్లాడుతూ పట్టణంలో మొత్తం 42 వార్డులు ఉండగా ఒక్క వార్డులో కూడా స్థానికులకు ఆహ్లాదం కోసం ఒక్క పార్కు కూడా లేకపోవడం విచారకరమన్నారు. గత ప్రభుత్వ హయాంలో కొందరు కబ్జాదారులు పుర స్థలాలపై పట్టాలు పొందిన సంఘటనలు కూడా ఉన్నాయని, వాటిపై భూ చట్టం కింద కేసులను నమోదు చేయాలని కోరారు. కార్యక్రమంలో యువ మోర్చా మండల అధ్యక్షుడు నరసింహ, వాల్మీకి సాయి, తాయన్న, జాఫర్, లక్ష్మి నారాయణ, నాగరాజ్, ఆరిఫ్, నూరి పాల్గొన్నారు.

వర్క్ ఫ్రమ్ హోంపై సర్వే

ఆదోని టౌన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : పట్టణాల పరిధిలో పేదరిక నిర్మూలనలో భాగంగా ప్రభుత్వం వర్క్ ఫ్రమ్ హోంపై అన్ని సచివాలయాల పరిధిలో సర్వే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మునిసిపల్ కమిషనర్ కృష్ణ శుక్రవారం తెలిపారు. 18 నుంచి 50 సంవత్సరముల లోపు వయస్సు కలిగిన నిరుద్యోగులు అందరూ సచివాలయ సిబ్బంది నిర్వహించే ఈ సర్వేకు సహకరించి, తమ వివరాలు అందజేయాలని సూచించారు. అర్హులను గుర్తించి వారికి అన్ని ఐటీ సెక్టార్ సౌకర్యాలను కల్పిస్తారని అన్నారు. ఈనెల 10న తేదీవరకు జరిగే ఈ సర్వేను అర్హులైన నిరుద్యోగులు వినియోగించుకోవాలని కోరారు.

సమస్యలను పరిష్కరించాలి


సీడీపీవో కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ శంకరకు వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు

ఆదోని అగ్రికల్చర్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : ఆల్ ఇండియా బ్యాంకు ఉద్యోగుల సమస్యల పరిష్కరించకపోతే దేశ వ్యాప్తంగా సమ్మెకు పూనుకుంటామని యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్ ఆధ్వర్యంలో సాయంత్రం బ్యాంక్ ఆఫ్ యూనియన్ ఆధ్వర్యంలో సాయంత్రం బ్యాంక్ ఆఫ్ బరోడా బ్రాంచ్ ఎదుట నిరసన చేపట్టారు. వారు మాట్లాడుతూ బ్యాంకు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని ఆరోపించారు. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ దృష్టికి సమస్యలను తీసుకెళ్లినా స్పందించడం లేదన్నారు. బ్యాంకు ఉద్యోగులకు పని ఒత్తిడి తగ్గించాలని కోరారు.అవుట్‌సోర్సింగ్ ఉద్యోగాల నియామకాలను చేపట్టరాదన్నారు. వచ్చేనెల 24,25 తేదీలలో తలపెట్టే సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజు, హరినాథ్, హనుమన్న, గాయత్రి, ప్రఫుల్ కుమార్ పాల్గొన్నారు.

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల గడువు పొడిగింపు

ఆలూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : ఆలూరు మండలంలోని అరికేర డా బీఆర్ అంబేద్కర్ గురుకులం పాఠశాలలో 2025-26 సంవత్సరానికి 5వ తరగతి ఇంటర్ మొదటి సంవత్సరాల్లో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు గడువును ఈనెల 13వరకు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ మనోరాజు శుక్రవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఏపీ సాంఘీక సంక్షేమ గురుకులంలో 2024-2025 విద్యాసంవత్సరానికి ఇంటర్ మొదటి సంవత్సరం (ఇంగ్లీషు మీడియం)లో ప్రవేశానికి ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 4వ తరగతి ప్రవేశానికి స్టడీ సర్టిఫికెట్, ఆధార్, రేషన్ కార్డు, ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశానికి పదో తరగతి స్టడీ, ఆధార్, రేషన్ కార్డులతో మీ దగ్గరలోని ఆన్‌లైన్ సెంటర్లలో లేదా గురుకుల పాఠశాలలోదరఖాస్తు చేసుకోవాలన్నారు.

విధులకు గైర్హాజరైతే వేటు తప్పదు


కపటిలో సిబ్బందితో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

ఆదోని రూరల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): విధులకు గైర్హాజరైతే వేటు తప్పదని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ హెచ్చరించారు. శుక్రవారం తహసీల్దార్ శివరాముడుతో కలిసి కపటి సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. విధులకు గైర్హాజరైతే మాత్రం కఠిన చర్యలు తప్పవని సబ్ కలెక్టర్ సిబ్బందిని హెచ్చరించారు. ముఖ్యంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న సర్వేయర్లను పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. అనంతరం పెసలబండలో జరుగుతున్న రీసర్వే పనులను సబ్ కలెక్టర్ పరిశీలించారు.

ఉపాధి పనులు కల్పించిన అధికారులు

ఆదోని రూరల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : గణేకల్లు గ్రామంలో ఉపాధి పనులు కూలీలకు అధికారులు కల్పించారు. ఉపాధి పనులు కల్పించని అధికారులు అనే శీర్షిక ఆంధ్రజ్యోతిలో ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు. అధికారులు సర్పంచు బంగారమ్మను మండల కార్యాలయానికి పిలిపించి ఉపాధి పనుల తీర్మానాల పుస్తకంలో సంతకం పెట్టించారు. ఏపీడీ లోకేష్, ఎంపీడీవో రాజేంద్రప్రసాద్, ఏపీవో కృష్ణమూర్తిలు మాట్లాడుతూ గణేకల్లులో కూలీలందరికి ఉపాధి పనులు కల్పించామని సర్పంచుతో కూడా తీర్మానంలో సంతకం పెట్టించామని, ఇలాంటి ఘటనలు ఏ గ్రామంలో కూడా పునరావృతం కాకుండా చూస్తామని తెలిపారు.

రేపు చలో విజయవాడ

ఆదోని అగ్రికల్చర్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని 10న తలపెట్టిన చలో విజయవాడను జయప్రదం చేయాలని అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి వెంకటమ్మ సీఐటీయూ పట్టణ అధ్యక్షుడు తిప్పన్న కోరారు. శనివారం సీడీపీవో కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ శంకరకు జీతాలు పెంచాలని వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు వరలక్ష్మి, కరుణ, శశికళ పాల్గొన్నారు.

బోయలను ఎస్టీ జాబితాలో చేర్చండి

● సీఎంను కోరిన క్రాంతి నాయుడు


సీఎం చంద్రబాబుకు వినతి పత్రం ఇస్తున్న క్రాంతి నాయుడు

పత్తికొండ టౌన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): బోయలను ఎస్టీ జాబితాలో చేర్చి న్యాయం చేయాలని ఏపీ వీబీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి న్యాయవాది క్రాంతి నాయుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడను విజ్ఞప్తి చేశారు. శుక్రవారం అసెంబ్లీ ఆవరణలో సీఎంను క్రాంతి నాయుడు కలిసి వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ 2017లో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో సత్యపాల్ కమిటీ రిపోర్టు, కారంశివాజీ ఏపీ ఎస్సీ, ఎస్టీ కమిషన్ నివేదికల ఆధారంగా అసెంబ్లీలో తీర్మానాన్ని ఆమోదించి కేంద్రానికి పంపడం జరిగిందన్నారు. ప్రస్తుతం కేంద్రంలో, రాష్ట్రంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వాలు ఉన్నందుకు ఇప్పటికైనా చొరవ తీసుకుని బోయకు న్యాయం చేయాలని చంద్రబాబును కోరినట్లు క్రాంతి నాయుడు తెలిపారు. సీఎంను కలిసిన వారిలో వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ బాబు నాయుడు, బైటప్ప నాయుడు, చంద్ర, గోపాల్ పాల్గొన్నారు.

ముగిసిన గాది లింగేశ్వర స్వామి ఉత్సవాలు

హాలహర్వి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గాలింగేశ్వర స్వామి ఉత్సవాలు నేటితో ముగిశాయని దేవాదాయ శాఖ ఈవో రాదాకృష్ణ తెలిపారు. శుక్రవారం స్వామి విగ్రహానికి పూలమాలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు నాలుగవ రోజు మొక్కుబడులు తీర్చుకునేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి భారీగా తరలిరావడంతో ఆలయ భక్తులతో కిటకిటలాడింది. ఆలయ ఈవో రాధాకృష్ణ తాత్కాలిక హుండి లెక్కింపు రూ.2లక్షలు వచ్చిందని వెల్లడించారు.

వేతనాల పెంపు కోసం కార్మికుల ధర్నా


అసిస్టెంట్ కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న సీఐటీయూ నాయకులు

ఆదోని టౌన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : వేతనాలను పెంచాలని మునిసిపల్ ఇంజనీరింగ్ కార్మికులు శుక్రవారం కార్యాలయం ముందు సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అంజి బాబు, జిల్లా ఉపాధ్యక్షుడు పీ ఈరన్న మాట్లాడుతూ, అనేక సంవత్సరాలుగా కార్మికులు వివిధ విభాగాలలో తక్కువ వేతనాలతో పని చేస్తున్నారని, వారికి కనీస వేతనంగా రూ.28వేలు పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం అసిస్టెంట్ కమిషనర్ డా. అనుపమకు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో కార్మిక నాయకులు అహమ్మద్, పీరా, మూర్తి, శివ, దాదా పీర్, కైలాష్, ఈరన్న, శివరాం పాల్గొన్నారు.

రాఘవేంద్రుడికి స్వర్ణ పల్లకోత్సవం

మంత్రాలయం, మార్చి 7(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్రుడి స్వర్ణ పల్లకోత్సవం రమణీయంగా నిర్వహించారు. రాఘవేంద్రస్వామి మఠంలో శుక్రవారం అష్టమి శుభదినాన్ని పురస్కరించుకొని పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాఘవేంద్రస్వామి బృందావన ప్రతిమను స్వర్ణపల్లకిలో అధిష్ఠించి రమణీయంగా ఊరేగించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణాలు మంగళవాయిద్యాలు మధ్య శ్రీమఠం ప్రాంగణం చుట్టూ ఊరేగుతున్న దృశ్యం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం ఊంజలసేవ చేశారు. బృందావనానికి బంగారు, వెండి,పట్టు వస్త్రాలు, గులాబి పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. వేలాది మంది భక్తులు తరలి రావడంతో మంత్రాలయం కిక్కిరిసింది.


స్వర్ణపల్లకిలో ఊరేగుతున్న రాఘవేంద్ర స్వామి

అవార్డులు ప్రదానం: రాఘవేంద్రస్వామి మఠంలో శుక్రవారం రాత్రి యోగీంద్ర కళామంటపంలో స్పేస్ మీడియా, డీసీఎక్స్ ఆధ్వర్యంలో ప్రముఖులకు పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు మంత్రాలయం పరిమళ ప్రశస్తి-2025 అవార్డులను ప్రదానం చేశారు. విద్యా,వైద్య, సాంకేతిక, సంస్కృత, ఆర్థిక రంగాల్లో విశేష కృషి చేసిన వారిని గుర్తించి అవార్డులకు ఎంపిక చేశారు. ఇందులో అదాన్ గ్రూప్ ఆఫ్ కంపెనీ ప్రెసిడెంట్ కిషోర్ ఆల్వా, కర్ణాటకలోని విజయనగర జిల్లా కలెక్టర్ దివాకర్, అంబేడ్కర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ సంపత్ రాజ్, రాఘవేంద్ర, మంత్రాలయానికి చెందిన డీఎం ఆనందరావు, విశ్వనాథ్‌లతో పాటు 25 మంది ప్రముఖులకు బృందావన ప్రతిమ, ప్రశంస పత్రం, రాఘవేంద్రస్వామి మెమెంటోతో సత్కరించారు. కార్యక్రమంలో ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్లు వెంకటేష్‌జోషి, ఏఈ బద్రినాథ్, అసిస్టెంట్ మేనేజర్ ఐపీ నరసింహస్వామి, అనంతపురాణిక్, ద్వారపాలక అనంతస్వామి, ప్రకాష్ ఆచార్, జేపీ స్వామి, శ్రీపాధాచార్, గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.


కర్ణాటక రమేష్ కేఫ్ ఫౌండర్ దివ్య రాఘవేంద్రలకు అవార్డు అందజేస్తున్న పీఠాధిపతి

అక్రమాలపై విచారణ చేపట్టాలి

అసెంబ్లీలో ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఎమ్మిగనూరు, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు చేనేత సహకార సంఘంలో జరిగిన అవినీతి అక్రమాలపై విచారణ చేయాలని ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డి కోరారు. అసెంబ్లీలో జరిగిన ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డి మాట్లాడుతూ ఎమ్మిగనూరులో 1938లో పద్మశ్రీ మాచాని సోమప్ప చేనేతల కోసం ఎమ్మిగనూరు చేనేత సహకార సంఘాన్ని ఏర్పాటు చేశారన్నారు. అప్పట్లో సొసైటీ కింద దాదాపు 3053మంది సభ్యులు ఉండేవారన్నారు. ప్రస్తుతం కేవలం 200 నుంచి 500మంది మాత్రమే ఉన్నారన్నారు. గతంలో సొసైటీ అభివృద్ధి కోసం త్రీబుల్ ఆర్ స్కీం కింద రూ. 5కోట్లు మంజూరయ్యాయన్నారు. ఆ నిధులను ఎలా ఉపయోగించారు? దేనికి ఖర్చు చేశారో, జరిగిన అక్రమాలపై విచారణ చేయించాలని సంబంధిత మంత్రిని కోరారు. చేనేత సొసైటీ నిర్వీర్యం కాకుండా ఉండేందుకు వెంటనే నామినేటెడ్ బాడీని ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

సమష్టి కృషితో విజయవంతం

మంత్రాలయం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి గురు వైభవోత్సవాలు అందరి సమష్టి కృషితోనే విజయవంతమయ్యాయని ఏఏవో మాధవశెట్టి అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో రాఘవేంద్రస్వామి మార్చి 1న 404వ పట్టాభిషేకం, 6న 430వ జన్మదిన వేడుకలు పురస్కరించుకుని ఆరు రోజుల పాటు కన్నుల పండువగా ఉత్సవాలు జరిగాయన్నారు. ఉత్సవాలను విజయవంతం చేసేందుకు కృషి చేసిన ప్రతి ఒక్కరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

చలో విజయవాడను జయప్రదం చేయండి


మాట్లాడుతున్న సీఐటీయూ నాయకురాలు గోవర్ధనమ్మ

ఎమ్మిగనూరు రూరల్ /టౌన్, మార్చి7(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ వర్కర్లకు, హెల్పర్లకు కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలని ఈనెల 10న చేపట్టిన చలో విజయవాడను జయప్రదం చేయాలని సీఐటీయూ నాయకురాలు గోవర్ధనమ్మ కోరారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేతనాల పెంపు, గ్రాట్యుటీ, పెన్షన్ కోసం గత ప్రభుత్వ హయాంలో 42 రోజుల పాటు సమ్మె చేసినప్పటికీ గత ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందన్నారు. అప్పట్లో సమ్మె శిబిరాల్లోకి వచ్చిన కూటమి నాయకులు తాము అధికారంలోకి వస్తే న్యాయం చేస్తామని చెప్పి ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. తమ డిమాండ్లు నెరవేర్చాలని ఈనెల 10న చేపట్టే చలో విజయవాడను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాగలక్ష్మి, మల్లేశ్వరి, వరలక్ష్మి, యుఎం నాగలక్ష్మి, శకుంతలమ్మ, హబీనా, సీఐటీయూ నాయకులు రాముడు పాల్గొన్నారు.

10న అంతర్రాష్ట్ర పొట్టేళ్ల బల ప్రదర్శన

ఎమ్మిగనూరు రూరల్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మండలం బనవాసి గ్రామంలో మారెమ్మవ్వ దేవరను పురస్కరించుకొని 10న అంతర్రాష్ట్ర పొట్టేళ్ల బల ప్రదర్శనను ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు రాముడు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఆరు పళ్ల సైజు, నాలుగు పళ్లు, రెండు పళ్ల సైజుల పొట్టేళ్ల బల ప్రదర్శన ఉంటుందన్నారు. గెలుపొందిన పొట్టేళ్లకు మొదటి బహుమతి రూ.25వేలు, ద్వితీయ బహుమతి రూ.12,516, మూడవ బహుమతి రూ.5,116లు అందజేయనున్నట్లు తెలిపారు. అలాగే ఆరుపళ్ల సైజులో గెలుపొందిన వాటిలో మొదటి బహుమతి రూ.8,116, ద్వితీయ బహుమతి రూ.5,116లు, నాలుగు, రెండు పళ్ల సైజులో మొదటి బహుమతి రూ.6,116, ద్వితీయ బహుమతి రూ.4,116లు అందజేయనున్నట్లు వివరించారు. ఓపెన్ కేటగిరిలో తలపడే పొట్టేళ్లకు ఎంట్రీ ఫీజు రూ.వెయ్యి, ఆరు పళ్ల సైజు పొట్టేళ్లకు రూ.800, నాలుగు పళ్ల సైజు పొట్టేళ్లకు రూ.700, రెండు పళ్ల సైజు పొట్టేళ్లకు రూ.500లు ఉంటుందన్నారు. వివరాలకు సెల్: 8247366071, 8074885619, 9542551020లకు సంప్రదించాలని కోరారు.

చెత్త కుప్పలు తొలగించండి


సుళేకేరిలో రోడ్డుపై ఉన్న చెత్త కుప్పలు

కౌతాళం, మార్చి 7(ఆంధ్రజ్యోతి): రోడ్డుకు ఇరువైపులా చెత్తాచెదారంతో పాటు కొందరు పెంట దిబ్బలను వేస్తున్నారని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలోని సుళేకేరి గ్రామంలో రోడ్లపైనే ప్రజలు పెంట దిబ్బలను వేయడంతో వాహనదారులు ప్రమాదాలను గురవుతున్నారు. పంచాయతీ కార్యదర్శులు రోడ్లపై వేసిన దిబ్బలను తొలగించి వాహనాలు సజావుగా ముందుకు వెళ్లేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. దీనికి తోడు దగ్గరలోనే పాఠశాల ఉండటంతో దిబ్బల వల్ల విద్యార్థులు రోగాల బారిన పడే అవకాశం లేకపోలేదు. గ్రామంలో కూడా పారిశుధ్య పనులు చేపట్టకపోవడంతో డ్రైనేజీ కాలువలు చెత్తాచెదారంతో నిండిపోయాయి.

చెరువు నీరు కలుషితం కాకుండా చర్యలు

గుడికల్ చెరువును పరిశీలించిన కమిషనర్, ఎంపీడీవో

ఎమ్మిగనూరు, మార్చి7(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణానికి తాగునీటి అవసరాల కోసం నీటిని నిలువ చేసే గుడికల్ చెరువు కలుషితం కాకుండా తగిన చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి తెలిపారు. శుక్రవారం గుడికల్ చెరువును ఎంపీడీవో బంగారమ్మతో కలిసి మున్సిపల్ కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా గుడికల్ గ్రామం పరిసరాల నుంచి చెరువులో నీరు కలువకుండా ప్రత్యేకంగా డ్రైన్ ఏర్పాటు చేసేందుకు స్థలాన్ని పరిశీలించారు. డ్రైన్ ఏర్పాటు చేస్తే గ్రామం నుంచి వచ్చే మురుగు నీరు పక్కనుంచి భూముల్లోకి వెళ్లే విధంగా కాలువను తవ్వేందుకు పనులు ప్రారంభించాలని ఇరువురు అధికారులు ఆదేశించారు. దీంతో సిబ్బంది వెంటనే పనులు ప్రారంభించారు. అలాగే చెరువును సైతం పరిశుభ్రంగా ఉండేందుకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ సిబ్బందిని ఆదేశించారు. అలాగే వేసవికి పట్టణానికి అవసరమైన నీటిని నిలిపేందుకు స్లూయిస్ దగ్గర బండ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పట్టణ ప్రజలు తాగునీటిని వృదా చేయరాదన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ విజయలక్ష్మి, డీఈఈ నీరజ, ఏఈలు శరత్ చంద్ర, మదన్, గ్రామ నాయకులు నాగేష్ పాల్గొన్నారు.


సిబ్బందితో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్

మండలానికి కెరీర్ మెంటల్ హెల్త్ కౌన్సెలర్ ఏర్పాటు

గోనెగండ్ల, మార్చి 7(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను తెలుసుకొని పరిష్కరించేందుకు గాను ప్రభుత్వం మండలానికి ఒక కేరీర్ మెంటల్ హెల్త్ కౌన్సెలర్‌ను ఏర్పాటు చేసిందని రాష్ట్ర సమగ్ర శిక్షి పీఎంయూ కోఆర్డినేటర్ ఛాయేంద్రకుమార్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను ఆయన పరిశీలించారు. విద్యార్థులతో ఆయన మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతివారం కేరీర్‌మెంటల్ హెల్త్ కౌన్సెలర్ మండలంలోని ఒక పాఠశాలను సందర్శించి విద్యార్థుల ఎలాంటి సమస్యలు ఎదుర్కొంటున్నారో తెలుసుకొని కౌన్సెలింగ్ ఇచ్చి మానసిక ఆరోగ్యవంతులుగా సిద్ధం చేయాలన్నారు. అలాగే విద్యార్థుల సహజ సామర్థ్యాలను గుర్తించి జీవితంలో స్థిరపడటానికి వివిధ కోర్సులపైన అవగాహన కల్పించాలన్నారు. పాఠశాలలకు సరిగా రాని విద్యార్థులను గుర్తించి వారి తల్లిదండ్రులతో మాట్లాడి పాఠశాలకు వచ్చే విధంగా చర్యలు తీసుకుంటారని ఆయన తెలిపారు. ఈ విధానం నవోదయ, సైనిక్, ఏకలవ్య, వంటి పాఠశాలల్లో మాత్రమే ఉండేదని, అయితే ప్రస్తుతం రాష్ట్రప్రభుత్వం కూడా ఈ విధానాన్ని ప్రవేశ పెట్టిందని ఆయన వివరించారు. సమావేశంలో ఎంఈవో నీలకంఠ, ప్రిన్సిపాల్ విద్యావతి, కేరీర్‌మెంటల్ హెల్త్ కౌన్సెలర్ సుచరిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న ఛాయేంద్రకుమార్



మహిళలు మహారాణులు

● పురుషులతో సమానంగా రాణింపు

ఎమ్మిగనూరు రూరల్ , మార్చి 7(ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు వంటింటికే పరిమితమైన మహిళలు ప్రస్తుతం అన్ని రంగాల్లో రాణిస్తూ పురుషులతో పోటీ పడుతున్నారు. వ్యవసాయం మొదలు కొని పోలీసు, సేవా రంగం, రక్షణ రంగం, న్యాయ రంగం, వైద్య, విద్య వంటి అనేకర రంగాల్లో మహిళలు ముందుండి తాము ఏ రంగం లోను తక్కువకాదని నిరూపించుకుంటున్నారు. ఓవైపు ఇంటి పనులు, పిల్లలను చూసుకుంటునే ఉద్యోగ రంగాల్లో రాణిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.


రుక్మిణి, ఏఎస్ఐ

ఈ చిత్రంలోని మహిళ పేరు రుక్మిణిదేవి. ఎమ్మిగనూరు రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తున్నారు. రుక్మిణిదేవి తండ్రి తిప్పేస్వామి ఓ చేనేత కార్మికుడు. ఆయనకు నలుగురు కుమార్తెలు. ఇందులో మొదటి కుమార్తె రుక్మిణిదేవి. ఎన్నో కష్టాలు పడి చదివిన రుక్మిణిదేవి 1991లో కానిస్టేబుల్‌గా ఉద్యోగ బాధ్యతల్లో చేరింది. తన 2013లో కఠిన సేవా పథకాన్ని, ఉత్తమ ఉద్యోగినిగాను ఎన్నో అవార్డులను అందుకున్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చిన బాధితులను ప్రేమతో పలుకరిస్తూ వారి కష్టాలు తెలుసుకొని ధైర్యం చెబుతున్నారు. మహిళలకు ఆదర్శంగా నిలిస్తూ వస్తున్నారు.


మహేశ్వరి, టైపిస్ట్ కమ్ అసిస్టెంట్

ఈ చిత్రంలోని మహిళ పేరు మహేశ్వరి. ఎమ్మిగనూరులోని జూనియర్ సివిల్‌జడ్జి కోర్టులో టైపిస్ట్, అసిస్టెంగా విధులు నిర్వహింది. ఓవైపు ఇంటి పనులు, పిల్లలను చూసుకుంటూ రోజు కర్నూలు నుంచి ఎమ్మిగనూరు కోర్టుకు వచ్చి విధులు నిర్వహిస్తున్నారు. మహేశ్వరి తండ్రి రిటైర్డు కండెక్టర్. 2016లో టైపిస్టుగా చేరిన ఆమె కోర్టులో ఉన్నతంగా విధులు నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

అన్ని రంగాల్లో రాణించాలి

ఆదోని డీఎస్పీ హేమలత

ఎమ్మిగనూరు రూరల్ , మార్చి 7(ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఆదోని డీఎస్పీ హేమలత అన్నారు. శుక్రవారం ముందస్తుగా ఎర్రకోట సెయింట్ జాన్స్ ఇంజినీరింగ్ కళాశాలలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆదోని డీఎస్పీ హేమలత హాజరై మాట్లాడుతూ మహిళలు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలన్నారు. ప్రస్తుతం మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, అయినప్పటికి చాలా మంది ఆడపిల్లలు చదువును మధ్యలో మానివేస్తున్నారన్నారు. చదువుకుంటే ఎంతటి కష్టాలనైనా అధిగమించవచ్చన్నారు. అనంతరం డీఎస్పీని కళాశాల డైరెక్టర్ అనుసూయమ్మ, నసీమా, డాక్టర్ సువర్ణ, డాక్టర్ సన్మానించారు. సమావేశంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పది ఆటోలు సీజ్, కేసు నమోదు

మంత్రాలయం, మార్చి 7(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం పుణ్యక్షేత్రంలో ప్రధాన రోడ్లపై ఇష్టానుసారంగా నడుపుతూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించిన పది ఆటోలపై కేసులు నమోదు చేసి సీజ్ చేసినట్లు ఎస్ఐ శివాంజల్ తెలిపారు. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు మహాముఖద్వారం, ఆధ్యాత్మిక కేంద్రం, రాఘవేంద్ర సర్కిల్, ప్రధాన రహదారుల్లో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించిన ఆటోలపై కేసులు నమోదు చేశామన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే ఆటో డ్రైవర్లపై కేసులు నమోదు చసి కఠిన చర్యలు తీసుకంటామని, అనుమతులు, రికార్డులు లేని వాహనాలను ఆర్డీవోకు పంపిస్తామని హెచ్చరించారు.

సీడీపీవోకు ఏపీడీగా పదోన్నతి


సీడీపీవోను సన్మానిస్తున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, టీచర్లు

మంత్రాలయం, మార్చి 7(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం ఐసీడీఎస్‌లో సీడీపీవోగా పని చేస్తున్న నాగమణికి అనంతపురం జిల్లాలో ఏపీడీగా పదోన్నతి లభించింది. శుక్రవారం ఆమెను సూపర్‌వైజర్లు నాగవేణి, బాగ్యలక్ష్మిబాయి, గోవిందమ్మ, కాత్యాయని, అఖిల, సులోచన, సుప్రియ, భీమశ్వరి, లావణ్యలత, మీనాక్షి, నాగమ్మ, అనిత, తులసమ్మ, మాధురి ఘనంగా సన్మానించారు. తనకు సహకరించి అంగన్‌వాడీలకు, సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. సిబ్బంది షేక్షావలి, అయ్యన్న, పద్మావతి, భారతి, శాంతమ్మ, భాగ్యమ్మ, ధనలక్ష్మి పాల్గొన్నారు.

'పది'లో వంద శాతం ఉత్తీర్ణతపై దృష్టి

మంత్రాలయం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఉన్నత, కస్తూర్బా, మోడల్ స్కూల్‌లో వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని ఎంఈవో రాగన్న సూచించారు. శుక్ర వారం చిలకలడోన కస్తూర్బా, జడ్పీ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు, మధ్యాహ్న భోజనం, మౌలిక వసతులు పరిశీలించారు. పదవ తరగతి విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు. ఈ నెల 17నుంచి ప్రారంభమయ్యే పదవ తరగతి పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత పెంచేందుకు హెచ్ఎం, ఆయా సబ్జెక్టుల ఉపాధ్యాయులు ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని సూచించారు. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించి ఉత్తీర్ణత దిశగా పయనించేటట్లు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎంలు జాన్సన్, నాగరాజు, సరళాదేవి, ప్రిన్సిపాల్ శాంతి, అనుసూయ, భ్రమరాంబ, రామకృష్ణవేణి పాల్గొన్నారు.

కాటికాపరుల సమస్యలు పరిష్కరించాలి

మంత్రాలయం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): శ్మశానాల్లో గుంతలు తీసి శవాలను పూడ్చే పనులు చేసే కాటి కాపరుల సమస్యలు పరిష్కరించాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు జయరాజు, కాటికాపరుల సంఘం నాయకులు సురేష్, అనిల్, మారెప్ప డిమాండ్ చేశారు. శుక్రవారం మంత్రాలయం మండంలలోని మాధవరం నియోజకవ ర్గంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి సోదరుడు రామకృష్ణారెడ్డికి వినతి పత్రం అందజేశారు. అదేవిధంగా ఆయా గ్రామాల్లో పర్యటించి కరపత్రాలు విడుదల చేశారు. ఈ నెల 11న విజయవాడలో కాటికాపరుల సంఘం మహాధర్నా జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో దేవిపుత్ర, విజయ్, యేసు బాబు, యాకోబు, డేవిడ్, ఇసాక్, వీరేష్, చిన్నతిక్కన్న, హనుమంతు, అశోక్, అంజనేయులు పాల్గొన్నారు.

ముగిసిన బడేసాహెబ్ స్వామి ఉరుసు


స్వామివారికి జియారత్ గంధం అందజేస్తున్న పీఠాధిపతులు

గోనెగండ్ల, మార్చి 7(ఆంధ్రజ్యోతి): గంజహళ్లి గ్రామంలో బడేసాహెబ్ ఉరుసు శుక్రవారం జియారత్ గంధంతో ఘనంగా ముగిసింది. ఉదయం నుంచి దర్గా పీఠాధిపతులు స్వామి వారి గంధంతో మేళాతాళలతో ఉరేగింపుగా దర్గాను చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. స్వామి వారి జీవసమాధికి భక్తితో గంధం పట్టించారు. సమాధిని పూలతో అలంకరించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమానికి భక్తుల పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. పీఠాధిపతుల ఇంటి నుంచి గంధాన్ని దర్గాకు తీసుకెళ్తున్న మార్గంలో భక్తులు పీఠాధిపతులను ప్రత్యేకంగా పూలు, జలం, అత్తరుతో పూజించారు.

ఎఫ్ఐఆర్‌లో పేరు తొలగించడం సరికాదు


వివరాలు తెలుపుతున్న బాధితురాలు వాసు లీలావతి

ఎమ్మిగనూరు, మార్చి7(ఆంధ్రజ్యోతి): ఫిర్యాదుదారుల అను మతి లేకుండా ఎఫ్ఐఆర్‌లో పేరు తొలగించడం సరికాదని పట్టణానికి చెందిన వాసులీలావతి అన్నారు. శుక్రవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ మంత్రాలయంలో తాను కొనుగోలు చేసిన 2.75సెంట్ల స్థలాన్ని కొంత మంది ఉద్దేశపూర్వకంగా నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని, ఇందుకు అప్పటి ఎమ్మిగ నూరు సబ్‌రిజిస్ట్రార్ రామదాసు సహకరించారని ఆరోపించారు. తనకు జరి గిన అన్యాయంపై అప్పట్లో మంత్రాలయం ఎస్ఐగా ఉన్న గోపినాథ్‌కు ఫిర్యాదు చేశామన్నారు. ఇందుకు స్పందించిన ఆయన సబ్‌రిజిస్ట్రార్‌తో పాటు ఐదుమందిపై కేసునమోదు చేశారని తెలిపారు. అయితే ఐదో నిందితుడిగా ఉన్న రామదాసు పేరును ఎస్ఐ తొలగించారని ఆరోపిం చారు. ఎలాంటి విచారణ చేయ కుండా, ఫిర్యాదుదారుల అనుమతి లేకుండా ఎఫ్ఐఆర్ నుంచి పేరు ఎలా తొలగిస్తారని ప్రశ్నించారు. తొలగించిన సబ్‌రిజిస్ట్రార్ పేరును ఎఫ్ఐఆర్‌లో తిరిగి చేర్చి, అక్ర మంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్న అక్రమార్కులపై చర్యలు తీసుకో వాలని లేనిపక్షంలో తమకు చావే శరణ్యమని ఆవేదన వ్యక్తం చేశారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన అవసరం


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డివిజినల్ మలేరియా నివారణ అధికారి

గోనెగండ్ల, మార్చి 7(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన ఎంతో అవసరమని ఆదోని డివిజన్ మలేరియా నివారణ అధికారి సాయిబాబా అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కులుమాల గ్రామం నందు వైద్యసిబ్బంది, పంచాయతీ సిబ్బంది గ్రామంలో పర్యటించి సీజనల్, దోమల ద్వారా వచ్చే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామంలో గత వారం రోజుల క్రితం డెంగీ కేసు నమోదు అయిన ఇంటి పరిసర ప్రాంతంలో దోమల నివారణ మందును పిచికారి చేశారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌వో సుధాకర్, ఎంపీహెచ్ఎస్ కృష్ణ, ఎఎన్ఎం, ఆశా వర్కర్లు, ఎంఎల్‌హెచ్‌పీ పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయుడు షబ్బీర్

ఎమ్మిగనూరు రూరల్, మార్చి7(ఆంధ్రజ్యోతి): మండలంలోని కడివెళ్ల మోడల్ స్కూల్‌లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ఉపాధ్యాయుడు షబ్బీర్ తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని మాచ్‌మాన్‌దొడ్డి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 5వ తరగతి చదివే విద్యార్థులు 31వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అలాగే 9వ తరగతి నుంచి ఇంటర్ చదివే విద్యార్థినులకు హాస్టల్ వసతి ఉందన్నారు. పరీక్ష ఫీజు రూ.150 చెల్లిస్తే తామే పాఠశాలలో ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేస్తామన్నారు.

ఎస్సీ కుల గణన జాబితా నుంచి తొలగించాలి

ఎమ్మిగనూరు టౌన్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ఎస్సీ కులగణన జాబితా నుంచి తొలగించాలని కేవీపీఎస్ మండల ఉపాధ్యక్షులు ఆంథోని, సుమాల డిమాండ్ చేశారు. శుక్రవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ముందు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్ రెడ్డి ఈ ప్రాంతంలో లేని మాదాసి కురువలు, మాదారి కురుబలు గురించి అసెంబ్లీలో మాట్లాడటం శోచనీయంగా ఉందన్నారు. కార్యక్రమంలో రంగన్న, ప్రసన్న, ప్రకాశం, గుండప్ప తదితరులు పాల్గొన్నారు.